
# విద్యార్థి జ్వాల

Rs. 12/- per copy
Vol. 28 - No.6
April 2022



4లో

శుభ శుక్రవారంలోని
**శుభం**

# సిలువ విలువ

యేసుక్రీస్తు మన తరములో మరణించి ఉంటే, మన స్పందన ఎలా ఉంటుంది? అని ఒక బైబిల్ కళాశాల ప్రొఫెసర్ తన విద్యార్థుల్ని ప్రశ్నించాడు. ఒక విద్యార్థి వెంటనే, "యేసుక్రీస్తు సిలువ మోస్తుండగా ఆయనతో ఒక సెల్ఫీదిగి, దాన్ని నా ఫేస్‌బుక్ ద్వారా, వాట్సాప్ ద్వారా నా స్నేహితులకు పంపేవాడిని" అని సమాధానం చెప్పాడు. అది విన్న ఆ ప్రొఫెసర్ ఆశ్చర్యపోయాడు. ఇది నేటి తరం ఆలోచనా విధానం, క్రీస్తు సిలువ కార్యానికి ఇచ్చే విలువ. ఈనాడు సిలువను ఒక అందమైన వస్తువుగా, ఆభరణంగా, ఇళ్ళమీద, సంఘ భవనాల మీద, సమాధులమీద వేసుకొనే ఒక మత సంబంధమైన గుర్తుగా వాడుకొంటున్నారే గానీ సిలువ గొప్పతనాన్ని, దాని సందేశాన్ని మర్చిపోతున్నారు.

క్రీస్తు సిలువ గొప్పతనం ఏంటి? అనే ప్రశ్నను చాలామంది అడుగుతుంటారు. క్రీస్తు జన్మ మానవ 'చరిత్రను' విభాగిస్తే, క్రీస్తు సిలువ మానవ 'నిత్యత్వాన్ని' విభాగించింది. క్రీస్తు సిలువ కార్యాన్ని నమ్మనివారికి నిత్యనరకమని, నమ్మిన వారికి నిత్యజీవమని, బైబిల్ చెబుతుంది.

క్రీస్తు సిలువ మానవునికి విలువను ఇచ్చింది. ఈ లోకంలో 'మనీ'కి ఉన్న విలువ 'మనిషి'కి లేదంటారు. మనీ కుటుంబ సంబంధాలను, సహవాసాల్లోని వ్యక్తుల గౌరవ మర్యాదలను, సంఘాలను, రాజకీయాలను శాసిస్తూ ఉంది. అలాగే అధికారం, అందం, కులం అంతస్థు కూడా ఈ కోవలోకే వస్తాయి. ఇవి ఎవరికి ఎక్కువగా ఉంటాయో సమాజం,సంఘం వారిని అంతగా గౌరవిస్తుంది, వారి కి అంత విలువను ఇస్తుంది. ఇది జగమెరిగిన సత్యం. యేసుక్రీస్తు ఏ బేధములేకుండా మానవులందరిని ప్రేమించి, వారిని విలువైనవారిగా ఎంచి సమస్త మానవాళి రక్షణకై తన ప్రశస్తమైన రక్తాన్ని సిలువలో ధారపోసాడు."సిలువపై క్రీస్తు మరణం...దేవుని ప్రేమకు ప్రత్యక్ష నిదర్శనం. రక్తం ఓడుతున్న శరీరంతో క్రీస్తు తలవాల్చడమన్నది.. 'నేను మిమ్మల్ని నిజంగా ప్రేమిస్తున్నాను' అనే దైవ సంకేతం తప్ప మరొకటి కాదు" అని అంటారు బిల్లీ గ్రేహం.

మన విలువ ఏమిటి? అని ఒకవేళ మనం కరుణామయుడైన క్రీస్తును అడిగితే, 'నా సిలువే మీ విలువ' అని అంటాడు. ఈ సత్యాన్ని గ్రహించిన మిషనరీస్ అంటరానివారిని, అణగారినవారిని, కుష్టువ్యాధిగ్రస్తులను, కొండల్లో, మారుమూల ప్రాంతాల్లో నివసించే వారిని, నాగరికత తెలియని వారిని ప్రేమించి అక్కున చేర్చుకొన్నారు. శుభ్రతలేని వారి శరీరాలను, రసిక కారే పుళ్ళను సైతం ముట్టుకొని, కడిగి, తుడిచి చికిత్స చేసి, విద్య నేర్పించి క్రీస్తు ప్రేమను, మాదిరిని కనపరచి, వ్యక్తి విలువను ప్రపంచానికి చాటారు.


క్రీస్తు సిలువ మన దేహంతో దేవునిని మహిమపరచాలని కోరుతుంది. అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు రాస్తూ "మీరు విలువ పెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి (1 కొరింథీ 6. 20), మీరు విలువ పెట్టి కొనబడినవారు గనుక మనుష్యులకు దాసులు కాకుడి (1కొరింథీ 7:23)" అని చెబుతాడు. ఈ విషయాన్ని రాసిన పౌలు, మిగిలిన అపొస్తలులు తాము విల ువపెట్టి కొనబడినవారని గ్రహించి మనుష్యులకు దాసులు గా కాకుండా తాము 'దేవునికి దాసులం' అని చెప్పుకొని అలా జీవించారు. దాసులు గా వారు తమ యజమానుడైన క్రీస్తు మాటకు విధేయత చూపారు, ఆయన చిత్తాన్ని చేశారు. గృహనిర్వాహకులుగా, తగ్గింపుతో, దేవుని పని పట్ల సిద్ధ మనస్సు కలిగి జీవించారు, క్రీస్తునే మహిమపరచారు. మనం కూడా క్రీస్తుకు దాసులం అనే భావన ఎల్లప్పుడు కలిగి ఉండకపోతే వ్యక్తులకు, వస్తువులకు ఎక్కువ విలువను, సమయాన్ని ఇస్తూ వ్యక్తులకు, వస్తువులకు దాసులమయ్యే ప్రమాదం ఉంది.

క్రీస్తు సిలువ మనకు ఒక పిలుపును ఇస్తుంది. "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్నుతాను ఉపేక్షించుకొని ప్రతిదినము తన సిలువను ఎత్తుకొని నన్ను వెంబడింపవలె ను" (లూకా 9:23). ఎవరైనను ఆయనను వెంబడించాలంటే ప్రతి దినం తన జీవితానికి యజమాని తాను కాదని, క్రీస్తే అని గుర్తెరిగి జీవించాలి.

"దేవుడు ఇంత శక్తివంతంగా నిన్ను ఉపయోగించుకోవడంలో గల రహస్యమేంటి?" అని ఒక వ్యక్తి జార్జిముల్లర్‌ను ప్రశ్నిస్తే, వెంటనే ఆయన "నేను మరణించాను కాబట్టి" అని జవాబిచ్చాడట. ఆ తర్వాత మరలా మాట్లాడుతూ "జార్జ్ ముల్లర్‌గా నేను మరణించాను. నా స్వంత ఉద్దేశాలకు, స్వచిత్తానికి, ఈ లోకానికి, ఇతరుల అభినందనలకు నేను మరణించాను. దేవుని యెదుట యోగ్యునిగా కనపరచుకోడానికి మాత్రమే నేను కోరుకుంటాను" అని చెప్పాడట. ఎవరినీ ఆర్థిక సహాయం అడగకుండా రెండువేలమంది అనాథలను ప్రతిరోజు ఎలా పోషించగలిగాడు? చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా ఎలాంటి చింతలేకుండా ప్రశాంతంగా ఎలా ఉండగలిగాడు? లాంటి ప్రశ్నలన్నిటికి ఆయనిచ్చిన ఒకే ఒక్క జవాబు "జార్జ్‌ముల్లర్ సిలువ వేయబడ్డాడు". "తన్ను తాను ఉపేక్షించుకోనంతకాలం ఒక వ్యక్తిలో సమృద్ధియైన ఆత్మీయ జీవితం ఉనికిలోకిరాదు" అని అంటాడు వెస్లీ డ్యూయల్.

క్రీస్తు సిలువ త్యాగాన్ని జ్ఞాపకం చేసుకొందాం, కృతజ్ఞత కలిగి ఉంటూ, ఆ సందేశాన్ని అనుసరిద్దాం, క్రీస్తు సిలువ వార్తను నశించే విద్యార్థి లోకానికి చాటుదాం.

– పి. సునీల్ జాకబ్




Vol. 28, No.6 April 2022
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:
Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:
The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:
Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:
**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:
**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:
**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:
May : Leadership
June : Problems of believing students
July : Imitating Christ
August : Patriotism

**Note:** Please send your writeups on or before
**10th of every month**

# నిరీక్షణ



"వణుకుతున్న చేతులు, వంగి పోయిన వేళ్ళు, కృశించిపోయిన కండరాలు, మెలితిరిగిన మోకాళ్ళు, స్పర్శలేని దేహం – ఒకానొక రోజు నీతి వస్త్రాల కాంతిలో ప్రకాశిస్తూ ధగధగా వెలుగులు విరజిమ్ముతాయి. చితికిపోయిన వెన్ను, మొద్దు బారిన దేహం, పెళుసుగా విరిగే ఎముకలు, పెంకులు కట్టిన చర్మం, మెదడు చితికి, ఆలోచన శుష్కించి నిస్సహాయతలో ఉన్న నాలాంటి మరెవరికైనా ఇలాంటి నిరీక్షణ ఉందా? నావలె దారుణ నిరుత్సాహంలో ఉన్న వారెవరికైనా ఆపన్నహస్తం అందించి ఆశ చిగురించగల సత్తా ఉందా? క్రీస్తు పునరుత్థాన సందేశం తప్ప – ప్రపంచంలో మరే మతమైనా, మరే సిద్ధాంతమైనా కొత్త మనస్సును, కొత్త హృదయాన్ని, కొత్త దేహాన్ని వాగ్దానం చేయగలవా?

– జోని ఎరిక్‌సన్ టడా

## లోపలి పేజీల్లో...

- సిలువ విలువ - 2
- శుభ శుక్రవారంలోని శుభం ఏమిటి? - 4
- సిలువ ఎవరు వేశారు? - 7
- సిలువపై క్రీస్తు పలికిన 7 మాటలు - 8
- సిలువవైపు చూస్తూ - 13
- క్రీస్తు పునరుత్థానం చారిత్రక సత్యం - 14
- సమాధికి అవతల ఉన్న నిరీక్షణ - 19
- దోషుండ నేను ప్రభువా - 22
- క్రాస్ వర్డ్ పజిల్ - 24
- తగ్గాల్సిందే... - 25
- భూలోకాన్ని తలక్రిందులు చేసేవారు - 29
- కోశాధికారి లేఖ - 31
- సిలువ - సవాలు - 32

కవర్ కథనం

# శుభ శుక్రవారంలోని శుభం ఏమిటి?

మానవ చరిత్రలో 2021 సంవత్సరాల క్రితం నజరేతువాడైన యేసుక్రీస్తు ఒక శుక్రవారం సిలువ మీద మరణించాడు. ఆ శుక్రవారాన్ని శుభ శుక్రవారం అంటారు. సాధారణంగా కొంతమంది మరణాన్ని అశుభంగా భావిస్తారు. యేసుక్రీస్తు మరణానికి ముందు, తరువాత కూడా ఎందరో గొప్ప వ్యక్తులు మరణించారు గదా! అయితే యేసుక్రీస్తు మరణాన్నే ఎందుకు శుభదినంగా పరిగణిస్తున్నారు? ఇంకా చెప్పాలంటే యేసు పొందిన సిలువ మరణం నేరస్తులకు, క్రూరమైన వారికి విధించే మరణశిక్ష. దీనిని చాలా అవమానకరమైన రీతిలో వేసేవారు. యేసు మరణించిన ఈ శుభశుక్రవారం ఏ రకంగా శుభము? ఎవరికి శుభము? అనేది తెలుసుకుందాం.

## సిలువ మరణం ఎలా ఉంటుంది?

మొట్టమొదటిగా అతి క్రూరమైన సిలువ మరణశిక్షను బార్బేరియన్లు కనిపెట్టారు. తరువాత రోమీయులు, గ్రీకులు కూడా భయంకరమైన, ఘోర నేరస్తులకు ఈ మరణశిక్షను వెయ్యడం మొదలుపెట్టారు. నేరం చేసి రుజువైన నేరస్తుడిని బాహాటంగా బట్టలూడదీసి, చిన్నతుండు మొలకు కట్టి, అందరూ చూసి భయపడేటట్లు ఒక ఎత్తైన స్థలంలో అడ్డు, నిలువుగా ఉన్న మాను మీద అతని రెండు చేతులకు, కాళ్ళకు మేకులు కొట్టి, ఒక గొయ్యి త్రవ్వించి అందులో ఆ నేరస్తుని కొట్టిన సిలువ చెక్కను గోతిలో దబ్బున కుదేస్తారు. ఆ నేరస్తుడు రోజుల తరబడి వర్షానికి తడుస్తుంటూ, ఎండకు ఎండుతూ ఆ సిలువ మీద వ్రేలాడుతూ అరుస్తూ ఉంటాడు. పక్షులు కూడా పొడుస్తుండవచ్చు. అలా వేలాడుతూ చివరికి ఊపిరాడక చనిపోతాడు. ఒకవేళ సబ్బాతు దినం వచ్చే ముందు చావకపోతే అతని కాళ్ళను విరగ్గొడతారు. అప్పుడు ఊపిరాడక చనిపోతాడు.

## యేసుక్రీస్తు సిలువ మరణం

యేసుక్రీస్తు కూడా నేరస్తునిలా ఈ క్రూరమైన సిలువ శిక్షకు గురయ్యాడు. ప్రత్యక్షసాక్షులైన సువార్త రచయితలు రాసినట్లుగా యేసుప్రభువును సిలువ మరణానికి ముందు రోజు రాత్రి అరెస్ట్ చేసి ప్రధాన యాజకుడైన కయప దగ్గరకు ఈడ్చుకెళ్ళారు. అక్కడ నుండి రోమా గవర్నరైన పిలాతు దగ్గర విచారణకు తీసుకొనివెళితే ఆయన హేరోదు దగ్గరకు పంపాడు. హేరోదు చాలా ప్రశ్నలు వేసి అపహసించి అన్యాయముగా నేరాన్ని మోపి మరలా పిలాతు నొద్దకు పంపించేశాడు. అక్కడ విచారణ చేసిన తరువాత సిలువ వెయ్యమని వెలుపల కేకలు వేస్తున్న యూదుల దగ్గరకెళ్ళి పిలాతు 'ఈయనలో ఏ దోషము లేదని స్పష్టం చేశాడు'.

పిలాతు యేసును విడిపించే మొదటి ప్రయత్నంలో యూదులు పస్కా పండుగ సందర్భంగా ఒక నేరస్తుడిని విడుదల చేయడం ఆనవాయితీ కాబట్టి యేసును విడుదల చేద్దామంటే ప్రజలు ఒప్పుకోకపోగా బరబ్బ



అనే బందిపోటు దొంగను విడుదల చేయమన్నారు. రెండవ ప్రయత్నంగా కొరడా దెబ్బలు కొట్టించడం ద్వారా వాళ్ళ అహం సంతృప్తి చెందుతుంది అనుకొని మరలా ఆయనలో దోషం లేదని చెప్పాడు.

కానీ సిలువ వెయ్యమన్న సమూహపు కేకలే గెలిచాయి. అంటే ఒక వ్యక్తిని నిర్దోషి అని తీర్పుతీర్చి, మరణ శిక్ష విధించడం అనేది ఏ న్యాయవ్యవస్థలో ఎన్నడూ జరగనిది. న్యాయపరంగా ఏ నేరము లేదని, యేసు నిర్దోషని నిరూపిస్తూనే శిక్షకు అప్పగించాడు. ఇది అన్యాయపు తీర్పు. చివరకు పిలాతు చేతులు కడుక్కొని ఈ నీతిమంతుని సిలువ శిక్ష వెయ్యడానికి వారికి అప్పగించాడు. అప్పుడు సిలువను మోయించి కపాలమనబడిన ఎత్తైన స్థలంలో ఇద్దరు నేరస్తులతోపాటు యేసుప్రభువును సిలువ వేశారు. సిలువలో వేలాడుతూ చివరిగా 'సమాప్తమైనది' అనే మాటను పలికి తండ్రికి తన ప్రాణాన్ని అప్పగిస్తూ ప్రాణాన్ని విడిచాడు. ఆయన మరణాన్ని నిర్ధారించడానికి ప్రక్కలో బల్లెంతో పొడిచారు. కానీ ఇరుప్రక్కలా వేలాడుతున్న నేరస్తులకు మాత్రమే కాళ్ళు విరగగొట్టారు. ప్రభువు కాళ్ళు విరుగగొట్టాల్సిన అవసరం రాలేదు. ఎందుకంటే ఆయన నిస్సందేహంగా మరణించాడని రోమా సైనికులు నిర్ధారించుకొన్నారు.

### శుభవార్తకు కారణాలు

మొదటిగా మానవుని యొక్క పాపం సృష్టికర్త, పరిశుద్ధుడైన దేవుని కోపాన్ని రేపి, ఆయన ఉగ్రతను మన మీదకి తెచ్చింది. దేవుని ఉగ్రత చల్లారడానికి పాతనిబంధన కాలంలో దేవుడు మోషేద్వారా సెలవిచ్చినట్లుగా ఏటేటా బలులు అర్పించి, శాంతింప చేసేవారు. కానీ అవి దేవుని ఉగ్రతకు కారణమైన పాపాన్ని గానీ, పాపపు గిలిని తొలగించలేకపోయింది. కావున యేసుక్రీస్తు మానవునిగా జన్మపాపము లేనివానిగా జన్మించి, పాపము లేనివానిగా జీవించి, దేవుని నీతిని నెరవేర్చి దేవుని ఉగ్రతను మరియు ఉగ్రతకు కారణమైన పాపాన్ని తొలగించుటకు సిలువలో పవిత్ర రక్తాన్ని చిందించారు (రోమా 3:24-25). కావున సకలమానవాళి పాపానికి, ఒక్కసారే బలియై, శాశ్వతముగా పాపమును తొలగించి దేవుని శాంతింపచేయుట వలన మన పాపం కొరకు శాంతికరమై యున్నాడు. దీన్ని 'శాంతి కుదర్చుటము' అన్నారు (1 యోహాను 2:1-2).



యేసు సిలువ మరణానికి కొన్ని గంటల ముందు ఒక ప్రఖ్యాతిగాంచిన నేరస్తుడైన బరబ్బ జైలు తలుపులు తట్టి, 'బరబ్బా నీకు శుభవార్త' అన్నారు. బరబ్బకు ఆశ్చర్యం! ఎందుకంటే రేపోమాపో రోమా ప్రభుత్వం విధించిన సిలువ మరణం యొక్క విచారణ కొరకు ఎదురుచూస్తున్నాడు. బ్రతికే అవకాశంలేని నేరస్తుడికి తన చావును వేరే నీతిమంతుడు తీసుకోవడం ఆ బరబ్బకు శుభం కాదా? మనందరం నేరస్తులం, మన నేరాన్ని యేసుప్రభువు ఆయన మీద వేసుకొని సిలువలో మరణించడం మనకు శుభం కాదా?

రెండవదిగా, మనం పాపం చేసి, ఆ పాపానికి దాసులమై, ఈ పాపదాస్యం నుండి ఎవరు విడిపిస్తారా అని సార్వత్రికమైన ప్రార్థన చేస్తున్నాము కదా! మనలను మనం విమోచించుకోలేని అశక్తత మరియు విమోచన అవసరతను బట్టి, మనలను పాపం నుండి విడిపించడానికి పరిశుద్ధుడైన యేసుక్రీస్తు సిలువ రక్తం, విమోచన క్రయధనంగా చెల్లించబడింది. దాన్ని 'విమోచన' అన్నారు (1 పేతురు 1:18-19).

మూడవదిగా న్యాయవంతుడు, తీర్పరియైన దేవుని న్యాయం ముందు పాపం చేసిన మనమందరం దోషులంగా నిలబడ్డాం. అపరాధభావంతో దాని కప్పిపుచ్చుకోవడానికి ఎన్నో పుణ్యకార్యాలు చేస్తున్నాము. అయితే అవేవీ నా పాపానికి రావాల్సిన మరణశిక్షకు ప్రత్యామ్నాయం కాదు. కాబట్టి ఈ మంచి శుక్రవారం నాడు నా మరణశిక్ష ఆయన మీద వేసుకోవడం ద్వారా నాకు శుభం జరిగింది. యేసు సిలువ మరణానికి కొన్ని గంటల ముందు ఒక ప్రఖ్యాతిగాంచిన నేరస్థుడైన బరబ్బ జైలు తలుపులు తట్టి, 'బరబ్బ నీకు శుభవార్త' అన్నారు. బరబ్బకు ఆశ్చర్యం! ఎందుకంటే రేపోమాపో రోమా ప్రభుత్వం విధించిన సిలువ మరణం యొక్క విచారణ కొరకు



యేసు రక్తం మన మధ్యలోని శారీరక, మానసిక, సాంఘిక, ఆర్థిక అడ్డుగోడ లను తీసివేసింది. కాబట్టి ఆయనను నమ్మిన మనం మరలా, కుల, మత, ఆస్తి, అంతస్తు, డినామినేషనల్ పరమైన అడ్డుగోడలను కట్టుకొంటూ, మన సంబంధబాంధవ్యాలను చెడగొట్టుకోవడం ద్వారా ఆయన సిలువ రక్తాన్ని దుర్వినియోగం చేయడంలేదా?

ఎదురుచూస్తున్నాడు. బ్రతికే అవకాశంలేని నేరస్తుడికి తన చావును వేరే నీతిమంతుడు తీసుకోవడం ఆ బరబ్బకు శుభం కాదా? మనందరం నేరస్తులం. మన నేరాన్ని యేసుప్రభువు ఆయన మీద వేసుకొని సిలువలో మరణించడం మనకు శుభం కాదా? దేవునితో ఎలైన్‌మెంట్ చేశాడు. అస్తవ్యస్త జీవితాన్ని క్షమించాడు. దాన్ని 'నీతిమంతునిగా తీర్చడం' అన్నారు (రోమా 3:24).

నాల్గవదిగా దేవుని సంతానంగా ఉన్న మానవులు పాపం చెయ్యడం ద్వారా తండ్రియైన దేవునితో వైరం ఏర్పడింది. మొదటి మానవులైన ఆదాము హవ్వలు దేవుని అధికారాన్ని సవాలు చేసినట్లు ఆజ్ఞను అతిక్రమించి పాపం చేశారు. తద్వారా దేవునితో, తోటి మనిషితో సంబంధాలు చెడిపోయాయి. చెడిపోయిన ఈ సంబంధాలను తిరిగి పునర్నిర్మించడానికి ఆయన సిలువ మరణం ద్వారా సంధి చేసి సమాధానాన్ని కుదిర్చాడు. మన సమాధానార్థమైన శిక్ష ఆయన మీద పడింది. బలియైనవాడు ఈ వైరాన్ని తొలగించాడు. దీన్ని 'సమాధానపరచబడటం' అంటారు (రోమా 5:9-11).

ఈ రీతిగా యేసయ్య మరణం మానవులందరికీ వారి పాపాల నుండి రక్షణను కలిగించిన మరణం, అంటే దేవుని ఉగ్రత నుంచి రక్షించి దేవుని కోపాన్ని, కోపానికి కారణమైన పాపాన్ని తొలగించిన మరణం. సమస్త మానవ పాపానికి యేసు మరణం శాంతికరం. అది ఎంతో శుభమును చేసిన సిలువ మరణం. అందుకే అది శుభ శుక్రవారము. అంతమాత్రమే కాదు, పాపాన్ని క్షమించి శిక్ష నుండి రక్షించడం మాత్రమే గాక పాత ముద్దాయిగా గాక పాపిని నీతిమంతునిగా నిలువబెట్టిన మరణమది. పాపపు చెర నుండి సాతాను బంధకాల నుంచి విమోచించిన మరణమది. పాపము వల్ల దేవునితో ఏర్పడిన వైరాన్ని తొలగించి సమాధానపరచి తెగిపోయిన బంధాన్ని తిరిగి ఏర్పరచి దేవుని పిల్లలు గా ఉండే అధికారాన్ని ఇచ్చిన మరణమది. ఇలాంటి యేసయ్య మరణం గొప్ప శుభానికి పునాది.

## ఈ శుభవార్త కొందరికా? లేక అందరికా?

ఈవిధంగా సమస్త మానవుల పాప విమోచన కొరకై దేవుని ప్రణాళికలో సిలువ మరణం కేంద్రం. సిలువ మరణం గూర్చి ప్రవక్తలు ప్రవచించినట్లు యేసుప్రభువు ఈ ఘడియ కొరకు ప్రార్థిస్తూ తననుతాను అప్పగించుకొన్నాడు. మొదటిగా ఈ శుభవార్తను అందరికీ దేవదూతలు, తర్వాత అపోస్తలులు యేసు గూర్చి ప్రకటించారు. ఈ శుక్రవారంలోని శుభం అప్పట్లోని కొద్దిమంది యూదులకు లేక ఇప్పటి క్రైస్తవులైన వారికే కాదు. ప్రతి మానవునికీ శుభవార్తే. ఎందుకంటే దేవుని దృష్టిలో ఏ ఒక్కడూ నీతిమంతుడు కాదు, అందరం దైవధర్మాన్ని, స్వధర్మాన్ని తప్పిపోయి, మనలను మనం రక్షించుకోలేకపోగా, పాపం, నరకం నుండి ఎవరు రక్షిస్తారని ఎదురుచూస్తున్నాము. గనుక అందరికి రక్షణ తీసుకొచ్చిన యేసుక్రీస్తు సిలువ మరణం అందరికీ శుభంకాదా? ముమ్మాటికీ ఇది శుభవార్తే. అయితే మతాలు, కట్టుబాట్లు అని ఈ శుభవార్తను చాలా మంది అంగీకరించడంలేదు. కానీ యేసయ్య మరణాన్ని, మరణాన్ని గెలిచి తిరిగిలేచిన యేసయ్యను నమ్మువారందరికీ పాప క్షమాపణ, విమోచన, మోక్షము కలుగుతుంది.

## సత్యానికి భిన్నంగా కట్టుకథలు

ఈ చారిత్రాత్మక సత్యానికి భిన్నంగా ఒక వర్గం కట్టుకథలు ప్రచురించడం చూస్తాం. ఆయన సిలువలో చనిపోలేదని, సమాధిలో పెట్టిన తరువాత చల్లదనానికి ఆయనకు స్పృహ వచ్చిందని, కట్లను విప్పుకొని, రాయిని పొర్లించి, బయటకు వచ్చాడని కట్టుకథలు సృష్టిస్తున్నారు. అయితే ప్రత్యక్షసాక్షులుగా ఉన్న క్రైస్తవులు మాత్రమేకాక, రోమా చరిత్రకారులు కూడా యేసు మరణాన్ని నిర్ధారించారు.

సిలువ మరణానికి ముందు భయంకరంగా యేసు వీపు దున్నబడింది. సిలువ బరువు మోశాడు, చేతులను, కాళ్ళను మేకులతో సిలువకు కొట్టారు.

ఆయన పక్కను బల్లెంతో పొడవడం వల్ల నీరు, రక్తం వచ్చింది. ఇరుప్రక్కల నేరస్తుల కాళ్ళు విరుగగొట్టినట్లు ప్రభువు కాళ్ళు విరగగొట్టవలసిన అవసరం రాలేదు. ఎందుకంటే ఆయన నిజంగా చనిపోయాడు. ఇలా చిత్రవధకు గురై, గుండెలో పొడవబడిన వ్యక్తి మెడికల్ సైన్స్ ప్రకారం ప్రాణంతో సమాధిలో నుంచి బయటకు రాగలడంటారా? ఈ చరిత్రాత్మక సత్యాన్ని తప్పుగా నిరూపించడానికి ఫ్రాంక్ మోరిసన్ అనే ప్రఖ్యాతిగాంచిన లాయర్ పరిశోధన చేయగా ఆయనకు లభించిన ఆధారాలన్నీ ఆయన మరణించాడని, సమాధి చేయబడ్డాడని, తిరిగి లేచాడని ఉన్నాయి. అప్పుడాయన తనకు లభించిన ఆధారాలన్నిటితో 'హూ మూవ్డ్‌దస్టోన్' అనే పుస్తకాన్ని రాశాడు.

ఈ సిలువ సువార్తను నమ్మడానికి యూదులకు ఆటంకంగాను, అన్యులకు వెర్రితనంగాను ఉన్నప్పటికీ విశ్వవ్యాప్తంగా అనేకమంది విశ్వసించారు. ఎందరైతే ఈ సత్యాన్ని అంగీకరించారో వారందరికీ దేవుని జ్ఞానం శక్తియై ఉంది. విశ్వసించిన వారు ఆయన సిలువ నీడలో ఇంటా, బయటా సమాధానంతో, విలువలతో జీవిస్తున్నారు.

## నేర్చుకోవాల్సిన పాఠాలు

ఈలాగు విశ్వసించిన మనం మొదటిగా అతిశయించడానికి లేదు కాని దీనత్వంతో ఒకరి కంటే ఒకరు యోగ్యులుగా యెంచుకోవాలి.

రెండవదిగా మళ్ళీ మళ్ళీ పాపంలో కొనసాగుతూ ఆయన గాయాలను మరలా మరలా రేపక మన ప్రాచీన స్వభావం సిలువలో చనిపోయిందని ఎంచుకొని, మన అవయవాలను నీతి సాధనాలుగా అప్పగించుకోవాలి (రోమా 6 అధ్యాయం).

మూడవదిగా యేసు రక్తం మన మధ్యలోని శారీరక, మానసిక, సాంఘిక, ఆర్థిక అడ్డుగోడలను తీసివేసింది. కాబట్టి ఆయనను నమ్మిన మనం మరలా, కుల, మత, ఆస్తి, అంతస్తు, డినామినేషనల్ పరమైన అడ్డుగోడలను కట్టుకొంటూ, మన సంబంధబాంధవ్యాలను చెడగొట్టుకోవడం ద్వారా ఆయన సిలువ రక్తాన్ని దుర్వినియోగం చేయడంలేదా? యేసయ్య మరణము సిలువ రక్తము ద్వారా కూల్చిన గోడలను మరలా కట్టకుండా యేసయ్య సంపాదించి ఇచ్చిన ఏకత్వముతో కుటుంబంలోనూ, సహవాసములోనూ సంఘములోనూ జీవిస్తూ నూతన సమైక్య సమాజ నిర్మాణానికి దారిచూపుతూ నిర్మించడానికి ప్రతిష్టించుకొందాం.

నాల్గవదిగా యేసుక్రీస్తు అవమానాన్ని, శ్రమను భరించిన సిలువ స్ఫూర్తితో మనకు కూడా ఆయనను వెంబడించడంలో ఎదురయ్యే శ్రమలు, అవమానాలు భరిస్తూ, మనలను మనం ఉపేక్షించుకొంటూ ఆయనను ప్రేమిస్తూ శత్రువులకు సహితము ఆయన ప్రేమను చూపిస్తూ ప్రభువుని వెంబడిద్దామా? అలా జీవించడానికి ప్రభువు కృపను చూపించునుగాక!

– బి. రంగనాథం, వైజాగ్

## సిలువ ఎవరు వేశారు?

సిలువను చూడాలని పరిగెత్తాను
చుట్టూ నేలంతా రక్తమయంగా ఉంది.
ఆ ప్రదేశానికి చేరుకునేసరికి ఆవేశం కట్టలు తెంచుకుంది

ఎవరు వేశారు సిలువ గట్టిగా అరిచాను.
ఎవరూ మాట్లాడలేదు

నా ఎదురుగా ఉన్న సోదరుని అడిగాను
సిలువ వేసిన పనిలో నీకు భాగం ఉందా అని
పెదవి విరిచాడు. నాకు ఈ లోక భోగభాగ్యాలు తప్ప భక్తి
పరమైనవేవీ పట్టవన్నాడు

మరో వ్యక్తిని ఆరా తీసాను
సంఘంలో నాకంటూ ఓ గ్రూప్‌ను ప్రోత్సహించాను తప్ప
ప్రభువు పనితో సంబంధం లేదన్నాడు


చివరకు ఓ పెద్దాయనను అడిగాను
ఈ ఊర్లో నాకు మించిన భక్తి, దాతృత్వం
ఎవ్వరికి లేదన్నాడు గనుక సిలువ వేయడంలో
నాకు భాగం లేదన్నాడు

సిలువలో ఆయన రక్తం కారుతూనే ఉంది
సూర్యుడు కూడా ఆయనను చూడలేక కనుమరుగయ్యాడు
అంతా చీకటి – నామకార్ధ జీవితంలో ఉన్నాం

ఎవరి చేతుల్లో రక్తమరకలుంటాయో వారే
తప్పక సిలువ నేరస్తులై ఉంటారని అనుకున్నాను

క్రమేణా వెలుగొచ్చింది
నా కళ్ళముందు సిలువ దృశ్యం కనుమరుగైంది
మా చేతులన్నీ రక్తసిక్తమైనాయి

– దాసరి రాజేష్, స్టేట్ సెక్రటరీ, తెలంగాణా



# సిలువపై క్రీస్తు పలికిన 7 మాటలు

మహాత్మాగాంధీ చనిపోయే ముందు ఏం మాట్లాడారు! ఇందిరాగాంధీ చనిపోయేముందు ఏం మాట్లాడారు!! ఇలా చరిత్రకారులు గొప్ప వ్యక్తుల చివరి మాటలను రికార్డ్ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. చనిపోయేముందు మాట్లాడిన మాటలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుంటారు. అలాగే యేసుక్రీస్తు మరణానికి ముందు మాట్లాడిన మాటలను రికార్డ్ చేయడం జరిగింది. అయితే ఆయన మరణానికి ముందు పలికిన మాటలు ఎంత ప్రాముఖ్యమైనవో, ఆయన బతికున్న దినాల్లో మాట్లాడిన ప్రతి మాట అంతే ప్రాముఖ్యమైనది. అంతేగాక ఆయన మరణాన్ని జయించి తిరిగి లేచిన తర్వాత మాట్లాడిన మాటలూ అంతే విలువైనవి.

**సిలువమీద ఆయన పలికిన ఏడు మాటల గూర్చి ఆలోచిస్తే...**

యేసు సిలువమీద గడిపిన కాలవ్యవధి ఆరు గంటలు. మొదటి మూడు మాటలు సుమారు ఉదయం 9గం॥లనుండి 12గం॥వరకు. చివరి నాలుగు మాటలు మధ్యాహ్నం 12గం॥ల నుండి 3గం॥ల వరకు (ఇది పగటి సమయమే కానీ లోకమంతటా చీకటిమయం అయ్యింది మార్కు 15:25-30).

**మొదటి మాట: యేసు-తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించమని చెప్పెను... (లూకా 23:34).**

నీ శత్రువులను ప్రేమించు... నీకు కీడు చేసిన వారికి ప్రతికీడు చేయక మేలుచేయాలి, క్షమించు... ప్రేమించు.. అని మూడున్నర సంవత్సరాలు చెప్పిన ఆయన మాటలను, బోధలను క్రియల్లో చేసి చూపించారు. తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించు అని యేసు పలికిన ఈ మాటలు (ప్రార్థన) యేసు మరణానికి కారకులైన యూదా నాయకుల, రోమా అధికారులు, సైన్యం, సమస్త మానవాళి గూర్చి పలికినవి.

భూమి మీద పాపాలు క్షమించడానికి అధికారం గల ఆయన అనేక పర్యాయాలు నేరుగా మీ పాపాలు క్షమించబడ్డాయని చెప్పెను (పాపాత్మురాలైన స్త్రీతో, పక్షవాయువుగలవానితో లూకా 7:48; మత్తయి 9:2).

అయితే, ఆకాశమునకు భూమికి మధ్యలో మనుష్యుల

పాపాలన్నీ ఆయనమీద వేసుకొని "పాపభారాన్ని మోసిన శాపగ్రాహిగా (సుమారు మూడు గంటల నుండి 6గం॥) సిలువపై వేలాడుతున్న ఆయన తాత్కాలికంగా మనుష్యుల పాపాలు క్షమించే అధికారం కోల్పోయిన వాడిగా తండ్రిని వేడుకొంటున్నాడని" అన్నాడు ఒక వేదాంతి.

ఏ వ్యక్తి అయినా క్షమించబడాలంటే పశ్చాత్తాపం అవసరం. అందుకనే యేసు మిమ్మల్ని క్షమిస్తాననో లేక నా తండ్రి మిమ్మల్ని క్షమిస్తాడనో చెప్పలేదు. ఎవరైతే వారి పాపాల నిమిత్తం దేవుని వద్ద పశ్చాత్తాపపడతారో వాళ్ళను క్షమించమని తండ్రిని వేడుకొన్నాడు.

యూదా అధికారులు, ప్రజలు ఏ మెస్సీయ కొరకు ఎదురు చూస్తున్నారో ఆయనే యేసు అని వాళ్ళు గ్రహించలేదు. యేసు లేఖనాలు ఎత్తి ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఎవరిద్వారా ఈ సృష్టి సృజించబడిందో, ఎవరిద్వారా సమస్త ప్రాణికోటి పోషించబడుతుందో తెలియక ఆయనను హేళన చేసి, ఉమ్మివేసి సిలువమరణానికి అప్పగించారు. అలాగే ప్రతి మనిషి వివిధ తంత్రములను కల్పించుకొని శరీరము యొక్కయు మనస్సు యొక్కయు కోర్కెల ను నెరవేర్చుకొనుచు ఆయనను సిలువ మరణానికి అప్పగించినవారే. ఎవరైతే సిలువ మీద ఆయన చేసిన త్యాగానికి, ప్రార్థనకు పశ్చాత్తాపంతో స్పందించారో, స్పందిస్తారో వాళ్ళు క్షమించబడ్డారు, క్షమించబడతారు సిలువమీద దొంగలా, రోమా శతాధిపతిలా, అనేకమంది యాజకుల్లా (మత్తయి 27:54; అపొ. కా 6:7). నీవు కూడా ఇలా క్షమించబడ్డావా?

అయితే క్షమించబడి, రక్షించబడిన వ్యక్తులంగా ఇతరులు మనపట్ల ద్రోహం, కీడు, హేళన చేసినప్పుడు వారిని యేసులా క్షమిస్తున్నామా? క్షమించకపోతే ఏ మవుతుంది?

విశ్వాసులు చాలా సార్లు తమ పట్ల తప్పు చేసినవారిని క్షమించినట్లు కనిపిస్తారు. కానీ వాళ్ళు కనిపించినప్పుడు లేదా సంఘటన గుర్తు వచ్చినప్పుడు కోపంతో ఊగిపోతారు. పైకి క్షమించినట్లు కనబడి ఇన్‌డైరెక్ట్‌గా కక్షసాధింపు మాటలు, పనులు చేస్తుంటారు. ఇది నిజమైన క్షమాపణ కాదు. నిజమైన క్షమాపణ అంటే క్షమించి ఆ విషయాన్ని మర్చిపోవాలి. దేవుడు మన పాపములను క్షమించి ఇక ఎన్నటికీ ఎలా జ్ఞాపకం చేసుకోడో అలా మనమూ క్షమించాలి.




## క్షమాపణ గూర్చి బైబిల్ ఏమి చెబుతుంది?

"...మీరు మనుష్యుల అపరాధములను క్షమింపకపోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు. మత్తయి 6:15). మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకంగా క్షమింపని యెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీ యెడల చేయును (మత్తయి 18:35). క్షమించుడి, అప్పుడు మీరు క్షమింపబడుదురు... మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరలా కొలవబడునని చెప్పెను (లూకా 6:38). మిమ్మును శపించువారిని దీవించుడి, మిమ్మును బాధించువారికొరకు ప్రార్థన చేయుడి, ఆశీర్వాదమునకు వారసులగుటకు మీరు పిలు వబడితిరి గనుక కీడుకు ప్రతికీడైనను దూషణకు ప్రతిదూషణయైనను చేయక దీవించుడి (లూకా 6:28; 1 పేతురు 3:9).

క్రైస్తవునికి క్షమించలేని వారంటూ ఎవరూ ఉండకూడదు (ఎవరినైనా క్షమిస్తాను కానీ వాడిని, ఆమెను క్షమించలేను అనకూడదు) ప్రభువు ఇలా అంటే మన పరిస్థితి ఏమవుతుందో ఆలోచించండి.

**రెండవమాట: ....నేడు నీవు నాతోకూడా పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను (లూకా 23:43).**

ఈ మాటకు కొంచెం వెనక్కి వెళితే (లూకా 23:39-42) తన్నుతాను రక్షించుకోలేని స్థితిలో ఉన్నట్లు కన్పించిన యేసులో ఏమి చూసి ఈ దొంగ (ఇతడు కూడా దూషించినవాడే మత్తయి 27:44; మార్కు 15:32) ఆయన రాజని, ఆయన రాజ్యముతో వస్తాడని ఆయన ఏ తప్పిదము చేయలేదని చెబుతూ యేసూ నీవు నీ రాజ్యముతో వచ్చినప్పుడు నన్ను



జ్ఞాపకం చేసుకోమన్నాడు. పోనీ ఆరోజు జరిగిన అద్భుతాలు (భూమి పునాదులు వణకటం, సమాధులు తెరవబడడం, దేవాలయపు తెర చిరిగిపోవటం, దేశం చీకటి కమ్మడం) చూసి ఇలా అన్నాడని అనుకోవడానికి అప్పటికి అవేమీ జరగలేదు. మరేమై ఉండవచ్చు! బహుశా, క్రీస్తుతో కూడా ఇతను తన సిలువ మోస్తూ క్రీస్తును గమనించి ఉండవచ్చు. తనను దారుణంగా హింసిస్తూ, దూషిస్తూ, హేళన చేస్తున్నవారిని చూసి వారిని క్షమించమని యేసు చేసిన ప్రార్థన ఆయనపై ప్రభావం చూపి ఇతడు నిజముగా దేవుని కుమారుడు నా లాంటి పాపి కాదు అని గ్రహించి పాపాలనిమిత్తం పశ్చాత్తాపపడ్డాడు. (నిజం చెప్పాలంటే ఇది ముమ్మాటికి పరిశుద్ధాత్మ కార్యం, దేవుని మహా కృప).

పశ్చాత్తాపంతో నన్ను జ్ఞాపకం చేసుకో అన్న దొంగతో నేడు నీవు నాతోకూడా పరదైసులో ఉందువు అనెను. ఇక్కడ మనం ఆలోచించాల్సింది పరదైసు/పరలోకం పాతాళం/ నరకం ఎక్కడ ఉన్నాయి... ఇలాంటివి కాదు. నేడు నేను చనిపోతే ఆయనతో ఉంటానా? ఆయన వస్తే ఆయనతో ఎత్తబడతానా? కొందరు ధైర్యంగా చెప్పగలరు నేను చనిపోతే ఖచ్చితంగా పరదైసు/పరలోకం వెళతానని, మరి కొందరు అదే నాకర్థం కావడం లేదు – పరలోకానికి వెళతానో! నరకానికి వెళ్తానో! అని కన్ఫ్యూజన్. ఈ విషయంలో ఎవరికీ కన్ఫ్యూజన్ ఉండకూడదు. నీ స్థితి(గమ్యం) ఏమిటో ఖచ్చితంగా తెలుసుకొని ఉండాలి.

ఒకసారి మెథడిస్ట్ సంఘ వ్యవస్థాపకుడైన జాన్‌వెస్లీని ఒక స్త్రీ అయ్యా రేపు రాత్రి 12గం॥లకు మీరు చనిపోతున్నారని ముందే తెలిస్తే మిగిలిన సమయాన్ని ఎలా గడుపుతారని ప్రశ్నించింది. జాన్‌వెస్లీ చాలా నింపాదిగా ఈ రోజు నేను ఏయే పనులు చేయాలని ముందుగా నిర్ణయించుకున్నానో అనగా ఈ రోజు సాయంత్రం గ్లోసెస్టర్‌లో సువార్త ప్రకటించి, రేపు ఉదయం 5 గం॥లకు వాక్య పరిచర్య చేసి మధ్యాహ్నం ట్యూకిల్ బరిలో ప్రసంగించి సాయంత్రం కమిటీ మీటింగ్‌కు వెళ్ళి తర్వాత రెవ. మార్టిన్ ఇంటిని దర్శించి ప్రార్థించి 10గం॥లకు నా గదికి చేరి నన్ను నా దేవుని హస్తాలకు అప్పగించుకొని మంచంమీద విశ్రమిస్తాను. మీరన్నట్లు అర్థరాత్రి 12గం॥ చనిపోతే మహిమలోకంలో నా దేవుని యెదుట కళ్ళు తెరుస్తాను. ఎంత గొప్ప నిరీక్షణ, నిశ్చయత, ధైర్యం.... ప్రియ సహోదరీ, సహోదరుడా నీకుందా ఈ నిరీక్షణ, ధైర్యం. ఉన్నవారు ధన్యులు. వాళ్ళ జీవితాలు భిన్నంగా ఉంటాయి. అట్టివారు ఈ లోకం, లోకాశల కొరకు పాకులాడరు.

**మూడవ మాట: అమ్మా ఇదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను! తర్వాత శిష్యుడ్ని చూసి ఇదిగో నీ తల్లి అని చెప్పెను (యోహాను 19:26-27).**

ఘోరమైన శిక్ష అనుభవిస్తూ కూడా జ్యేష్టునిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు. కన్నతల్లిపట్ల బాధ్యతను నెరవేర్చి మనకు మాదిరిని చూపించాడు. తల్లిదండ్రుల పట్ల మన వైఖరి ఎలా ఉండాలో బైబిల్ తేటగా చెబుతుంది.

నీ తల్లి ముదిమియందు ఆమెను నిర్లక్ష్యం చేయకుము (సామెతలు 23:22).

నీ తల్లిదండ్రులను నీవు సంతోషపెట్టవలెను (సామెతలు 23:25)

నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తల్లిని, తండ్రిని సన్మానించుము (నిర్గమ 20:12).


తన తల్లినైనను, తండ్రినైనను నిర్లక్ష్యముచేయువాడు శాపగ్రస్తుడు (ద్వితీ 27:16)

కొందరు ఇలా అనుకొంటారు.. మరియమ్మలాంటి తల్లి అయితే, అర్థం చేసుకొనే తల్లిదండ్రులైతే ప్రేమించవచ్చు, సన్మానించవచ్చు. కానీ మా అమ్మ, నాన్న గూర్చి మీకు తెలియదు వారు ఎలాంటివారో. ఇలాంటివారిని ఎలా ప్రేమించగలం? హలో...

మీ మంచి తల్లిదండ్రులను మాత్రమే సన్మానించు, ప్రేమించు అనలేదు. వాళ్ళు ఎలాంటివారైనా మనము వారిని ప్రేమించాల్సిందే, గౌరవించాల్సిందే. దేవుని యెదుట ఈ విషయంలో తలదించుకొనే విధంగా ఎవరూ ఉండకుందురు గాక! ఏ కుమార్తె, కుమారుని గూర్చి తన తల్లిదండ్రులు దు:ఖించకుందురుగాక!

**నాల్గవ మాట: ఏలీ, ఏలీ, లామా సబక్తానీ అని బిగ్గరగా కేకవేసెను (మత్తయి 27:46). ఎలోయీ, ఎలోయీ లామా సబక్తానీ(మార్కు 15:34). నాదేవా, నాదేవా నన్నెందుకు చేయి విడిచితివని అర్థం.**

ఏలీ, ఏలీ అని మత్తయి హీబ్రూ పదాలను ఉపయోగించాడు. ఎలోయీ, ఎలోయీ అని మార్కు అరమిక్ పదాలను ఉపయోగించాడు. ఇంతకు యేసు ఏ భాషలో ఈ మాటలు పలికాడు. ఖచ్చితంగా హీబ్రూలోనే. ఎందుకంటే ప్రజలు ఏలీయాను పిలుస్తున్నాడు అన్నారుగదా! ఒకాయన ఇలా అన్నాడు. మానవుల రక్షణకు, నాంది, పునాది ఈ కేకే. సైనికులు ఆయనను కొరడాలతో కొట్టారు, ఉమ్మివేశారు. వెంట్రుకలు పెరికారు, వస్త్రాలు తీసివేసి దిగంబరుడిగా చేశారు. చేతులకు కాళ్ళకు మేకులు కొట్టారు, అపహసించారు. ఇవన్నీ మౌనంగా భరించాడు. కానీ తన ప్రియమైన తండ్రి ఆయన నుండి ముఖము తిప్పుకొనేసరికి తట్టుకోలేని ఆవేదన. ఎప్పుడూ తండ్రీ తండ్రీ అని పిలిచే ఆయన దేవా, దేవా అని పిలవాల్సి వచ్చింది. (మధ్యాహ్నం 12గం॥ల నుండి తనకు అలవాటులేని స్థితిని అనుభవిస్తూ ఉన్నాడు, పిలవగానే పలికే తండ్రి విడిచిపెట్టాడు).




మన పాపాల వలన ఆయన శాపగ్రాహిగా (కొన్ని గంటలు) మారడాన్ని బట్టి తండ్రితో ఆయనకు ఎడబాటు కలిగింది. త్రిత్వంలో యేకమైయున్న తండ్రి, కుమారుల మధ్య ఇలాంటి యెడబాటు అంతకు ముందు ఎన్నడూ జరగలేదు, ఆ తర్వాత కూడా ఎన్నడూ జరగదు. ఇలాంటి ఆవేదనలో నుంచి వచ్చిందే ఆ కేక. దీనితో దేవుడు న్యాయవంతుడని, పాపాన్ని సహించడని రుజువు చేయబడింది. అయితే పాపిని ప్రేమిస్తాడని మరొకసారి నిరూపించబడింది.

**ఐదవ మాట:...నేను దప్పిగొనుచున్నాననెను (యోహాను 19:28).**

యేసుప్రభువు శారీరకంగా తనకు కలుగుచున్న బాధను వ్యక్తంచేస్తూ సిలువపై పలికిన మాట ఇదొక్కటే. యేసు ఈ భూమి మీద సంచరించిన 33 1/2 సంవత్సరాల్లో ఆయన దేవుడు అన్నది ఎంత సత్యమో, ఆయన మానవుడు అన్నది కూడా అంతే సత్యం. అందుకనే ఆయనను దైవమానవుడు (100% మానవుడు, 100%దేవుడు) అని బైబిల్ చెబుతుంది. ఆయన దైవత్వాన్ని సంతరించుకొన్న మానవుడు కాదు. మానవునిగా మారిన సృష్టికర్తయైన దేవుడు కాబట్టి సంపూర్ణ మానవునిగా అందరిలా అలసిపోయాడు, ఆదమరచి నిద్రపోయాడు, ఆనందించాడు, దు:ఖపడ్డాడు. ఆకలిగొన్నాడు, కోపపడ్డాడు... సిలువపై దప్పిగొన్నాడు.

కొందరు పండితులు యేసు ప్రభువు దాహం కేవలం నీళ్ళకోసం వేసిన శారీరక దాహం కాదని తండ్రితో తెగిన సంబంధాన్ని పునర్నిర్మించుకోవడానికి పడే తపన ద్వారా ఏర్పడిన దాహం మరియు తండ్రి చిత్తాన్ని (పాపుల కొరకు సిలువపై మరణం) నెరవేర్చాలనే తపన ద్వారా ఏర్పడిన దాహం అన్నారు.

ఒకవేళ పైన చెప్పబడింది కూడా సత్యమైతే నీకు నాకు ఇలాంటి (తండ్రి చిత్తం జరిగించాలని, ఆయనతో ఎడతెగని సంబంధం కలిగి ఉండాలని) తపన, దాహం ఉందా? నీ, నా దాహం దేనికొరకు? ధనవృద్ధి కొరకా? అధికారం కొరకా? పేరు ప్రఖ్యాతుల కొరకా? గుర్తింపు కొరకా? లేక దేవుని చిత్తం జరిగించడం కొరకా?

**ఆరవ మాట: సమాప్తమైనదని చెప్పి తలవంచి ఆత్మను అప్పగించెను (యోహాను 19:30).**

It is finished. Finished అనే పదానికి గ్రీకులో 'tetelestai' అనే పదాన్ని వాడారు. ఈ పదాన్ని బైబిల్‌లో నాలుగు సందర్భాలలో వాడారు. (నెరవేర్చబడింది, చెల్లించబడింది, తీర్చబడింది మరియు ఇక చాలించబడింది)

- ❊ ఏది నెరవేర్చబడింది? యేసుకు తండ్రి అప్పగించిన పని నెరవేర్చబడింది.
- ❊ ఏది చెల్లించబడింది? విమోచన క్రయధనం చెల్లించబడింది.
- ❊ ఏది తీర్చబడింది? ధర్మశాస్త్రపు విధి అంతా తీర్చబడింది.
- ❊ ఏది చాలించబడింది? లోకపాపము, దోషం చాలించబడింది.

'సమాప్తమైంది' ఇది చిన్న పదమే గానీ అది మానవ జాతికి ఓ శుభవార్త. పరలోకంలో ఆనందం. మానవుని పాపం, శాపం నుండి విడుదలకు మార్గం. దేవుని సంకల్పం పూర్తయింది. లేఖనాలు నెరవేర్చబడ్డాయి.

**మనం దేవుని యెదుట నిర్దోషులంగా నిలబడాలంటే రెండే రెండు మార్గాలు:**

1. దేవుడు నిర్దేశించిన ధర్మశాస్త్రాన్ని తు.చ. తప్పకుండా పాటించాలి. లేదా..

2. ధర్మశాస్త్ర విధిని సంపూర్తి చేసిన యేసు శక్తిని ఆశ్రయించాలి.

పాపియైన మనిషి ధర్మశాస్త్రాన్ని తు.చ. తప్పకుండా పాటించడం కష్టమే గానీ రక్షణ కార్యాన్ని పూర్తి చేసిన ఆయనయందు విశ్వాసముంచి పరలోకానికి వారసులు కాగలరు.

**ఏడవ మాట: తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుచున్నాను (లూకా 23:46).**

బైబిల్‌లో ఏడు అనే సంఖ్య విశ్రాంతికి, విజయానికి, సంపూర్ణతకు గుర్తు. ఆరవ మాటలో తన ఎదుట ఉంచబడిన పనిని విజయవంతంగా పూర్తిచేసి ఏడవ మాటలో విశ్రాంతిలోకి ప్రవేశిస్తున్నాడు.

యూదా తల్లులు తమ పిల్లలకు పడుకొనే ముందు మేము నిద్రపోతూ ఉండగా "మా ఆత్మలను నీ వశం చేసుకో దేవా, లేదా నీ చేతికి మా ఆత్మలను అప్పగించుచున్నామనే ప్రార్థన చేయిస్తారు. పిల్లలు ఈ మాటలు వల్లించి నిద్రలోకి వెళతారు. యేసు ఈ మాటలకు తండ్రీ అని చేర్చాడు. నాల్గవ మాటలో 'దేవా' అని చెప్పిన యేసు సిలువపై జయము పొందిన వెంటనే 'తండ్రీ' అని తన సహవాసమును నూతన పరచుకొని ప్రాణము విడిచాడు. యేసు తనకై తాను ప్రాణాన్ని పెడుతున్న రీతి ఇక్కడ స్పష్టం. నా అంతట నేనే దానిని పెట్టుచున్నాను. తిరిగి తీసుకొనుటకు నాకు అధికారం కలదు అని అన్నాడు (యోహాను 10:17).

చివరిగా ఒక సన్నివేశంతో ఈ ఆర్టికల్‌ను ముగిద్దాం. ఒక యౌవ్వనస్తురాలు ఒక ఫొటో స్టుడియోకి వెళ్ళింది. అక్కడే అనేక చిత్రాలను చూస్తూ చివరికి సిలువపై వేలాడుతున్న యేసు చిత్రాన్ని చూసి చిత్రకారుడిని ఈయన ఎవరు అని ప్రశ్నించింది. ఆయన ఆమెకు యేసు గూర్చి చెప్పాడు. ఆవిడ అక్కడనుంచి వెళ్ళి కొన్ని నెలలకు ఒక ఉత్తరం రాయడం జరిగింది. ఆ ఉత్తరంలో మీరు చెప్పిన మాటలు నేను ఇంటికి వెళ్ళి ఆలోచించి క్రీస్తును నా స్వంత రక్షకునిగా, ప్రభువుగా అంగీకరించడం జరిగింది. నేనిప్పుడు ఎంతో సంతోషంగా ఉన్నాను. మీరు క్రీస్తును నాకు పరిచయం చేసినందుకు చాలా ధన్యవాదాలు. ఆ ఉత్తరాన్ని చదివిన ఆయన ఆలోచించి "అయ్యో! ఆ అమ్మాయి పొందిన సంతోషాన్ని నేనెన్నడూ పొందలేదే" అని పశ్చాత్తాపంతో క్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించి సంతోషాన్ని స్వంతం చేసుకొని క్రీస్తు సిలువపై వ్రేలాడుతున్న మరొక చిత్రాన్ని గీసి క్రింద "నీ కోసం అంతా చేశాను, నా కోసం నీవు ఏమి చేశావు" అనే మాటలు రాస్తాడు. కొన్ని సంవత్సరాల తర్వాత ఒక యౌవ్వనస్తుడు స్టుడియోకు వచ్చి ఆ మాటలు ఉన్న చిత్రాన్ని చూసి తనకు కలిగిన సమస్తాన్ని ప్రభువుకు సమర్పించుకొని మొరేవియన్ మిషన్‌ను స్థాపిస్తాడు. ఈ సంస్థద్వారానే అనేక దేశాలను కదిలించిన జాన్ వెస్లీ రక్షించబడతాడు. ఇప్పుడు అదే ప్రశ్న మనం వేసుకొందాం. ఆయన నీకోసం, నాకోసం సమస్తాన్ని చేశాడు. ఆయనకోసం మనం ఏంచేశాం? ఏం చేస్తున్నాం?

**– పి.ప్రేమ్ కుమార్,**

స్టేట్ సెక్రటరీ, యుఇయస్ఐ-ఏపి



# సిలువ వైపు చూస్తూ...

ఓ పాస్టరు గారు తన ప్రసంగాన్ని ముగించాక ఒక యువకుడు ఆయన దగ్గరకొచ్చి "పాస్టరు గారు మీరిందాక పాపభారం గూర్చి చెప్పారు, అదెలా ఉంటుంది? నాకేమీ భారంగా అనిపించడం లేదు" అని అన్నాడు. మళ్ళీ అన్నాడు "నాకేమీ భారంగా అనిపించడంలేదు కాబట్టి నాలో పాపం లేనట్టా?" అప్పుడా పాస్టర్‌గారు మెల్లగా "నేను ఈ 100 కేజీల గంటను ఓ శవం మీద పెట్టాననుకో, ఆ శవానికి ఏమైనా బరువుగా ఉంటుందా?" అని అడిగాడు. ఆ యువకునికి విషయం అర్థమై మెల్లగా జారుకున్నాడు.

అపొస్తలుడైన పౌలు "...మీరును పాపము విషయమై మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తు యేసునందు సజీవులుగాను మిమ్మును మీరే ఎంచుకొనుడి" (రోమా 6:11) అని రాశాడు. అవిశ్వాసులకు, నిర్జీవులకు పాపం బరువు తెలియదు కానీ క్రీస్తునందు సజీవులమైన మనకు ప్రతిదినం అంటుకునే పాపం యొక్క బరువు తెలియాలి. ఆ గ్రహింపు కొరకు దేవునినడగాలి. అప్పుడు దాన్ని మోయలేక వీలైనంత త్వరగా కడిగివేసుకొంటాం. లేకుంటే మోయడం అలవాటై బరువు తెలియకుండా పోయి శరీరానుసారులంగా మిగులుతాం.

నిజానికి మన మీద ఉండాల్సిన పాపభారాన్ని యేసుక్రీసు తన మీద వేసుకొని మనలను సజీవుల నుగా చేశాడు. యెషయా ప్రవక్త రాస్తూ "మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను... యెహోవా మనందరి దోషము అతని మీద మోపెను" అని కొన్నివందల సంవత్సరాలకు ముందే ప్రకటించాడు. కానీ మనం కొన్నిసార్లు దాన్ని గ్రహించలేని స్థితిలో బతుకుతుంటాం.

క్రీస్తు సిలువ అనగానే పిలాతు తప్పును ఎత్తిచూపుతాం, ఇస్కరియోతు యూదా నమ్మకద్రోహాన్ని ఖండిస్తాం, యూదుల కర్కశత్వాన్ని దుయ్యబడతాము, రోమా ప్రభుత్వ నిరంకుశత్వాన్ని అసహ్యించుకొంటాం గానీ దానికసలు కారణమైన మన పాపస్వభావాన్ని తలుచుకోము. విశ్వాసులంగా ప్రతిదినం ఆయన సిలు వలో మన దోషాన్ని చూసుకోవడం అలవాటైతే మన ఆత్మీయ జీవిత పురోగతికి ఢోకా ఉండదు.

దావీదు తన పశ్చాత్తాప కీర్తనలో "నా అతిక్రమములు నాకు తెలిసేయున్నవి. నా పాపమెల్లప్పుడు నాయెదుట నున్నది" అని రాశాడు. పాపం గూర్చి నాకు తెలియదు అనడానికి లేదు. పౌలుగారు కొన్ని లిస్ట్‌లు తయారుచేశాడు. వాటిలో ఉదాహరణకు రోమా పత్రికలోని 1:29-32లో ఉన్నది ఒకటి. ఈ లిస్టును పరిశీలిస్తే మన బతుకు బండారం బయటపడుతుంది. మనలో ఉన్న వీటి కోసం కూడా "ఆయన గాయపరచబడ్డాడు, నలుగ గొట్టబడ్డాడు, అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలు గుచున్నది" (యెషయా 53:5).

జీవితాన్ని బిజీ బిజీ చేసుకుంటూ అసలు జీవితాన్నే నిర్లక్ష్యం చేస్తున్నాము. కాస్త పనులను పక్కనపెట్టి నిదానంగా సిలువనే తదేకంగా చూస్తూ ఆయన పొందిన ఆ ఘోర శ్రమ, మరణాలను తల పోసుకున్నప్పుడు కళ్ళవెంట నీరు కారుతుండగా వణికే పెదవులతో "నా దోషమే ప్రభూ..." అని చెప్పకమానము. వాటిని వదలక మానము.

– **జేసన్ బత్తుల**, చీరాల



# క్రీస్తు పునరుత్థానం చారిత్రక సత్యం

శాస్త్రీయజ్ఞానం ఆధారసహితమైనది హేతు బద్ధమైనది కానీ విశ్వాసం పరీక్షింపరానిది, ప్రశ్నింపరానిది అని హేతువాదులు తరచూ మాట్లాడటం వింటూవున్నాము. నిజంగా విశ్వాసం అసత్యీకరణకు (Falsification) తావులేనిదా? ఆధారాల వెలుగులో మార్పుకు అంగీకరించక పిడివాదం చేసేదే విశ్వాసమా? క్రైస్తవ విశ్వాసం హేతుబద్ధమైన, సత్యపరీక్షకు నిలిచే విశ్వాసమేనా? లేక మూఢ విశ్వాసమా?

క్రైస్తవ విశ్వాసం అసత్యీకరణకు (Falsification) ఆస్కారం ఉన్న విశ్వాసం, ఎందుకంటే దేవుడు ఉనికిలో లేకపోయినా, సత్యం సాపేక్షమైనా, యేసుక్రీస్తు చారిత్రక పురుషుడు కాకపోయినా, ఆయన మరణాన్ని జయించి పునరుత్థానుడు కాకపోయినా అది వ్యర్థం అని రుజువైపోతుంది. ఇలాంటి అనేక రంగాల్లో క్రైస్తవ విశ్వాసం యొక్క హేతుబద్ధతను పరీక్షించవచ్చు. అయితే యేసుక్రీస్తు పునరుత్థానం క్రైస్తవ విశ్వాసానికి మూలస్తంభం అంటే అతిశయోక్తికాదు. అందుకే క్రీస్తు లేపబడని యెడల మీ విశ్వాసం వ్యర్థమే అంటాడు పౌలు భక్తుడు (1 కొరింథీ 15:17). క్రీస్తు పునరుత్థానం క్రైస్తవ విశ్వాసానికి అత్యంత ప్రాముఖ్యమైనదని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. క్రీస్తు పునరుత్థానం చారిత్రక సత్యం కాకపోతే: (1 కొరింథీ 15:15-19)

* ఏది సత్యమని భావించి అపొస్తలులు తమ ప్రాణాలను సహితం ఫణంగా పెట్టారో ఆ ప్రకటన అప్రయోజనకరమైనది మాత్రమే కాదు అసత్యమని తేలిపోతుంది.
* అపొస్తలులు దేవుని పేరిట అసత్యాన్ని ప్రచురం చేసిన అబద్ధసాక్షులుగా, మోసగాళ్ళుగా మిగిలి పోతారు.
* భవిష్యత్‌లో మనకు మరణానంతర జీవితాన్ని గురించిన నిరీక్షణ లేకపోగా గతంలో మన పాపాల్ని దేవుడు క్షమించాడన్న నిశ్చయత కూడా లేకుండాపోతుంది.
* యేసుక్రీస్తునందు విశ్వాసముంచి చనిపోయిన వారు, ఆయనకోసం హతసాక్షులైనవారు పాపక్షమాపణ లేకుండా నశించిపోయినట్లే.
* చెడు ముగింపుకు, పరిపూర్ణ న్యాయంకోసం క్రైస్తవ విశ్వాసం భవిష్యత్‌ను గురించిన నిరీక్షణతో ముడిపడి ఉంది. గనుక భూత, వర్తమాన, భవిష్యత్ విషయాల భ్రమల్లో బ్రతుకుతున్న క్రైస్తవులు మనుష్యులందరికంటే దౌర్భాగ్యులుగా మిగిలిపోతారు.

క్రీస్తు పునరుత్థానం వల్ల వ్యక్తిగత, సంఘ జీవితాలకు ఆదరణాత్మక ప్రయోజనాలు ఉన్నాయి."సంఘం ప్రభువు సిలువను ధ్యానించినంతగా ఖాళీ సమాధిని గురించి కూడా ధ్యానించి ఉంటే దాని జీవితం ఆనందదాయకంగానూ, లోకానికి దాని తోడ్పాటు మరింత క్రియాత్మకంగానూ ఉండేది" అని అంటాడు జార్జ్ బీస్లీ ముర్రే. క్రీస్తు పునరుత్థానాన్ని కేవలం ఆయన సిలువ మరణాన్ని దేవుడు అంగీకరించడానికి ఋజువుగా పరిమితం చేయడం పునరుత్థానాన్ని అర్థం చేసుకోవడంలో మన వైఫల్యాన్ని సూచిస్తుంది. క్రైస్తవ విశ్వాస జీవితం ప్రభావవంతంగా జీవించడానికి పురికొల్పి, శక్తినిచ్చే విషయం గనుకనే పునరుత్థానం ప్రాముఖ్యతను సంతరించుకుంది.

## పునరుత్థానం తాత్విక అవరోధాలు

యేసుక్రీస్తు స్వయంగా తన పునరుత్థానాన్ని గూర్చి బోధించడం జరిగింది. (మత్తయి 12:40; 16:21; 17:22; మార్కు 9:9; 10:32; 14:27; లూకా 9:30; యోహాను 2:19; 10:14; 16:16). పునరుత్థానాన్ని తిరస్కరించిన సద్దూకయ్యులను యేసు "లేఖనములను గానీ దేవుని శక్తిని గానీ ఎరుగక మీరు పొరబడుచున్నారు" అని ఖండించడం కూడా చూస్తాము. (మత్తయి 22:29). ఆయన నిర్గమ 3వ అధ్యాయంలోని భాగాన్ని మరణానంతర నిత్యజీవానికి ఆధారంగా చూపించి దేవుడు సజీవులకే గానీ మృతులకు కాడని స్పష్టంచేయడం జరిగింది (మత్తయి 22:32). అయితే అద్భుతాలు జరిగే అవకాశాలు లేకపోయినా, వాస్తవాన్ని గూర్చిన సత్యజ్ఞానం సాధ్యం కాకపోయినా క్రీస్తు పునరుత్థానాన్ని విశ్వసించడం మూఢవిశ్వాసం అవుతుంది అనడంలో సందేహం లేదు. ఈ రెండు తాత్విక అవరోధాల్ని ముందు అధిగమించాలి.

### ఎ) అద్భుతాలు సాధ్యమవుతాయా?

చనిపోయిన వాళ్ళు తిరిగి బ్రతకడం తరచుగా జరిగే విషయంకాదు, అది సార్వత్రిక అనుభవం కూడా. మరణించి కొద్దికాలానికి మళ్ళీ బ్రతకడం జరిగింది అని ఎవరైనా చెబుతున్నట్లయితే అది తప్పకుండా ఒక అసాధారణ సవాలే. డేవిడ్ హ్యూమ్ (1711-1776) అద్భుతాలు జరిగే అవకాశమే లేదని నిరూపించాడు గనుక పునరుత్థానానికి ఋజువులు తిరస్కరించవచ్చు అనేది కొందరి వాదన. డేవిడ్ హ్యూమ్ నిజంగానే అద్భుతాలు జరిగే అవకాశం లేదని నిరూపించగలిగాడా? కాదనే అంటున్నారు

> శిష్యులు శవాన్ని ఎత్తుకెళ్ళి ఉంటే ఆయన పునరుత్థానం కోసం ప్రాణం పెట్టే సాహసం వాళ్ళు చేయగలరా? ఒక అబద్ధం అని తెలిసిన విషయం కోసం ప్రాణాలు పోగొట్టుకొనే బుద్ధిహీనులా వాళ్ళు? వాళ్ళ నైతిక జీవితంతో ఈ సిద్ధాంతం పొసగగలదా? భయం, నిస్పృహల వల్ల ప్రాణాన్ని చేతపట్టుకొని పారి పోయిన శిష్యుల జీవితాలు సమూలంగా మారి పోవడానికి కారణం ఏమిటి? యేసు మరణం తర్వాత ప్రత్యక్షమయ్యారనే అనుభూతుల్ని అనేకమంది పొందటానికి కారణం ఏమిటి? యాకోబు, పౌలు లాంటి వాళ్ళు మార్పు చెందడానికి కారణం?

నేటి సమకాలీన తత్వవేత్తలు. ఆయన వాదం ప్రకారం 1. ప్రకృతి నియమాలన్నీ మార్పులేని ఒకే విధమైన అనుభవాల ద్వారా స్థాపించడం జరిగింది. 2. అద్భుతాలు ప్రకృతి నియమాలను ఉల్లంఘించడమే. 3. కాబట్టి మార్పులేని ప్రకృతి నియమాలను ఉల్లంఘించే అద్భుతాలు జరగవు. అయితే హ్యూమ్ వాదనలో చక్రీయ హేతుదోషం ఉంది. అసలు ప్రకృతి నియమాలు "మార్పులేని" నియమాలు అవ్వాలంటే కనీసం ఒక్క అద్భుతం కూడా జరగలేదు-జరిగే అవకాశమే లేదు అనేది రుజువుకావాలి. అద్భుతాలు జరగవు అని వాదిస్తున్న వాదన వాస్తవానికి వాటి అసాధ్యాన్ని "విశ్వాసం"తో ఊహించుకోవడంగా మిగిలిపోయింది. క్రీస్తు పునరుత్థానం సహజ సంఘటన అనేది క్రైస్తవుల వాదన కాదు, దేవుడు ఆయనను లేపాడు అని నమ్మారు. కాబట్టి దేవుడు ఉనికిలో ఉంటే అద్భుతాలు సాధ్యమే.

### బి) వాస్తవాన్ని గురించిన సత్యజ్ఞానం సాధ్యమేనా?

ఇమ్మానుయేల్ కాంట్ (1724-1804) వాస్తవాన్ని గూర్చిన సత్యజ్ఞానం సాధ్యం కాదు అని ప్రతిపాదించడం జరిగింది. అదే నిజమైతే చరిత్రలో క్రీస్తు పునరుత్థానం జరిగినా ఆ సంఘటనను గూర్చిన సత్యజ్ఞానం మనం తెలిసికొనే అవకాశమే ఉండదు. కాంట్ వాదన ప్రకారం 1. వాస్తవాన్ని గూర్చి మనకు ఇంద్రియాల ద్వారా వచ్చిన సమాచారంతో మనం ఏర్పరచుకొనే

భావనలే మన జ్ఞానం. 2. వాస్తవాన్ని గూర్చిన మన అవగాహనకు, అసలు వాస్తవానికి అగాధం ఉంది. 3. కాబట్టి మనం తెలుసుకొన్న విషయాలు వాస్తవం పట్ల మనం ఏర్పరచుకొన్న అభిప్రాయాలే తప్ప, వాస్తవాన్ని ఉన్నది ఉన్నట్లుగా గ్రహించిన సత్యజ్ఞానం కాదు. ఈ వాదన కూడా లోపభూయిష్టమైనది. "వాస్తవాన్ని గూర్చిన సత్యజ్ఞానం లేదు" అని తెలుసుకోవడం కూడా "వాస్తవాన్ని గురించిన సత్యజ్ఞానాన్ని తెలుసుకోవడం" అని మర్చిపోకూడదు. కాబట్టి ఈ వాదన తనను తాను భంగపరచుకొంటుంది.

## పునరుత్థానం - చారిత్రక ఆధారాలు

యేసుక్రీస్తు పునరుత్థానానికి ఆధారాలను అన్వేషించేటప్పుడు చరిత్రకారులు నూతన నిబంధన దేవుని గ్రంథమని, అది సంపూర్ణంగా లోపరహిత గ్రంథమని అంగీకరించకుండానే చారిత్రక అంశాలను పరిశోధిస్తారు. అత్యంత విమర్శనాత్మక పండితులతో పాటు అత్యధిక పండితులు చారిత్రకంగా సత్యమని అంగీకరించి, ప్రత్యేకంగా ఒక్కొక్కటీ చారిత్రకంగా నిరూపించగలిగితే సుమారు 12 విషయాలను ప్రఖ్యాత క్రైస్తవ సమర్థవాది గ్యారీహబెర్మాస్ ప్రస్తావించారు.

## 12 చారిత్రక వాస్తవాలు

1. కఠినమైన సిలువ శిక్ష వల్ల యేసు చని పోయారు.
2. యేసును సమాధిచేశారు.
3. యేసు మరణం శిష్యుల నిరీక్షణల్ని ఆక్షేపించగా వాళ్ళు సందేహించారు, నిశ్పృహకు లోనయ్యారు.
4. కొన్ని రోజుల తర్వాత యేసును సమాధిచేసిన సమాధి ఖాళీ అవ్వడాన్ని కనుగొన్నారు.
5. పునరుత్థానుడైన యేసును నిజంగా చూశాము అనే వాస్తవ అనుభూతులకు శిష్యులు లోనయ్యారు.
6. ఆయన శిష్యుల జీవితాలు ఈ సంఘటనల గూర్చిన సత్యాలకోసం చనిపోవడానికి సిద్ధపడేంతగా పరివర్తన చెందాయి.
7. తొలిసంఘ ప్రసంగాలకు సువార్త కేంద్ర స్థానం అయ్యింది.
8. యేసు చనిపోయిన పట్టణమైన యెరూష లేములోకూడా సువార్త ప్రకటన జరిగింది.
9. ఆ శిష్యుల చేతనే ఆదిమ సంఘం స్థిరంగా స్థాపించడం జరిగింది.
10. యేసు తిరిగిలేచిన రోజు అని ప్రకటించిన ఆది వారం ప్రధాన ఆరాధన దినంగా పాటించారు.
11. యేసును మొదట సందేహించిన ఆయన సోదరుడైన యాకోబు, తనకు ఆయన కనిపించాడన్న నమ్మకం వల్ల ఆయన శిష్యుడిగా మార్పు చెందాడు.
12. సంఘాన్ని హింసించే వాళ్ళకు నాయకుడైన పౌలు కూడా పునరుత్థానుడైన యేసు తనకు ప్రత్యక్షమయ్యాడనే వాస్తవ అనుభూతి వల్ల మారి పోయాడు.

## విఫల సిద్ధాంతాలు

యేసు పునరుత్థానాన్ని ఒక సాధారణ సంఘటనగా వివరించే అనేక సిద్ధాంతాలు చరిత్రలో చాలానే పుట్టుకొచ్చాయి. అయితే చారిత్రకంగా నిరూపించగలిగిన పై 12 చారిత్రక సంఘటనలను హేతుబద్ధంగా, తార్కిక పొందికతో వివరించడంలో ఈ సిద్ధాంతాలన్నీ విఫలమైపోయాయి. ఇలాంటి విఫల మైన సిద్ధాంతాలలో కొన్నింటిని ఇక్కడ చూద్దాం.

### ఎ) పునరుత్థానం కల్పిత గాథ

కల్పిత గాథలు పుట్టుకురావడానికి వాస్తవ సంఘటనలకు వాటిని గూర్చి చెప్పే సంగతులకు మధ్య కాలవ్యవధి ఎక్కువైయుండాలి, లేదంటే ప్రత్యక్ష సాక్షులు ఆ కథల్ని ఇట్టే కొట్టిపారేస్తారు. యేసు పునరుత్థానాన్ని గూర్చిన సమాచారం సంఘటనలకు అత్యంత సమీపంగా ఉన్న తొలికాలానికి చెందినది. ఈ సమాచారాన్ని ఇచ్చినవాళ్ళు ప్రత్యక్ష సాక్షులు. తొలిదినాల్లో యేసును పాతిపెట్టిన పట్టణంలోనే, సమకాలికులు ఇంకా బ్రతికి ఉండగానే బాహాటంగా పునరుత్థానాన్ని ప్రకటించడం కల్పితగాథ సిద్ధాంతానికి గొడ్డలి పెట్టు. ఖాళీ సమాధి, శిష్యుల జీవితంలో ప్రాణాల్ని పెట్టేంత సమూల మార్పును, సంఘ తొలిదినాల్లో ఈ సత్యం కేంద్ర బిందువుకావడం లాంటి చారిత్రక సత్యాలను ఈ సిద్ధాంతం వివరించడంతో విఫలమైపోయింది.

### బి) యేసు శరీరాన్ని దొంగిలించారు

బహుశా యేసు శరీరాన్ని సమాధి నుంచి తీసుకెళ్ళి ఉంటారు, ఖాళీ సమాధి చూసి ఆయన పునరుత్థానుడయ్యాడనే నమ్మకం పుట్టి ఉంటుంది అనేది ఈ సిద్ధాంత సారాంశం. గత రెండు శతాబ్దాలకు చెందిన దాదాపు అందరు పండితులు ఈ సిద్ధాంతాన్ని తిరస్కరించడం జరిగింది.

శిష్యులు శవాన్ని ఎత్తుకెళ్ళి ఉంటే ఆయన పునరుత్థానం కోసం ప్రాణం పెట్టే సాహసం వాళ్ళు చేయగలరా? అబద్ధం అని తెలిసిన ఒక విషయం కోసం ప్రాణాలు పోగొట్టుకొనే బుద్ధిహీనులా వాళ్ళు? వాళ్ళ నైతిక జీవితంతో ఈ సిద్ధాంతం పొసగగలదా? భయం, నిస్పృహల వల్ల ప్రాణాన్ని చేతపట్టుకొని పారిపోయిన శిష్యుల జీవితాలు సమూలంగా మారి పోవడానికి కారణం ఏమిటి? యేసు మరణం తర్వాత ప్రత్యక్షమయ్యారనే అనుభూతుల్ని అనేక మంది పొందటానికి కారణం ఏమిటి? యాకోబు, పౌలు లాంటి వాళ్ళు మార్పు చెందడానికి కారణం? ఇలాంటి అనేక ప్రశ్నలకు ఈ సిద్ధాంతం జవాబులు చెప్పడంలో ఘోరంగా విఫలమయ్యింది.

యూదుల దగ్గర ఆయన శరీరం ఉండి ఉంటే శరీరాన్ని బయటపెట్టి క్రైస్తవ్య పునాదుల్ని తొలిదినాల్లోనే పెకలించి ఉండేవారు, అలా చేయలేదు సరికదా శిష్యులు ఎత్తుకెళ్ళారనే క్రొత్త సిద్ధాంతాన్ని తెరమీదకు తెచ్చారు. కాబట్టి యూదులు కూడా సమాధి ఖాళీగా ఉందన్న విషయాన్ని పరోక్షంగా అంగీకరించారు.

ఇంకెవరైనా తీసుకొనివెళ్ళినా శిష్యుల అనుభవాల్ని, యాకోబు, పౌలుల జీవితాల్లో వచ్చిన మార్పుల్ని ఈ సిద్ధాంతం వివరించలేదు.

### సి) యేసు సిలువలో సొమ్మసిల్లాడు

బహుశా యేసు సిలువ మీద చనిపోయి ఉండకపోవచ్చు, కేవలం సొమ్మసిల్లిన యేసు చనిపోయాడనుకొని సబ్బాతు దగ్గరగా ఉండడంతో తొందరలో సమాధి చేసి ఉండవచ్చు. సమాధిలోని చల్లని వాతావరణం వల్ల తేరుకొన్న యేసు సమాధిలోనుంచి బయటకు వచ్చి శిష్యులకు కనబడితే ఆయన పునరుత్థానుడయ్యాడనే నమ్మకంలోనికి శిష్యులు వచ్చి ఉండవచ్చు అనేది ఈ సిద్ధాంత సారాంశం. ఈ సిద్ధాంతం కూడా పెను సవాళ్ళను ఎదుర్కొంటుంది.

* సిలువ వేసే విధానం జాగ్రత్తగా గమనిస్తే సిలువకు గురైన వ్యక్తి సిలువపై వేలాడిన స్థితిలో ఊపిరాడక చనిపోతాడు. సిలువలో యేసు శరీరంలో కదలికలు లేకపోవడాన్ని బట్టి ఆయన చనిపోయారనే నిర్ణయానికి రోమన్ సైనికుడు రావడం చాలా సులువైన విషయం. అయినప్పటికీ ప్రక్కలో పొడిచి ఆ విషయాన్ని ధృవపరచుకోవడం జరిగింది.
* "ఆధునిక వైద్యశాస్త్ర పరిజ్ఞానానికి యేసు సిలువలో చనిపోలేదు అనే ఊహ వ్యతిరేకంగాఉంది" అని అంటారు సిలువపై పరిశోధనలు చేసిన అమెరికా దేశానికి చెందిన డాక్టర్స్ బృందం.
* 19వ శతాబ్దానికి చెందిన దైవశాస్త్రపండితుడు డేవిడ్ స్ట్రాస్ ఈ సిద్ధాంతం లోపభూయిష్టమైనదని సంపూర్ణంగా తిరస్కరించారు. "బలహీనంగా, అస్వస్థతతో వైద్యసేవల అవసరం కలిగి, గాయాలకు కట్లు, బలహీనతలో బలం అవసరం కలిగిన వ్యక్తి మరణాన్ని జయించిన వ్యక్తిగా, జీవితాలకు ప్రభువుగా శిష్యులను నమ్మించగలడా.. ఆ స్థితిలో పునరుజ్జీవం పొందిన వ్యక్తి శిష్యుల జీవితాల్లోని దు:ఖాన్ని ఉత్సాహంగా, భయాల్ని ఆరాధనగా ఖచ్చితంగా మార్చలేడు" అని అంటాడు.
* ఈ సిద్ధాంతం పౌలు జీవితాన్ని మార్చిన అనుభవాన్ని వివరించడంలోకూడా విఫలమవుతుంది.

### డి) భ్రమ సిద్ధాంతం

యేసు మరణానంతరం శిష్యులకు ప్రత్యక్షమైనట్లు వారికి కలిగిన అనుభవాలను వారి భ్రమగా ప్రతిపాదించేదే ఈ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం చాలా చారిత్రక సంఘటనల్ని వివరించడంలో విఫలమవుతుంది.

* శిష్యుల అనుభవాలు కేవలం భ్రమలుగా భావించినా, యేసు సమాధి ఖాళీగా ఎందుకు ఉందో ఇది వివరించలేదు.
* మానసిక శాస్త్రజ్ఞుల ప్రకారం భ్రమలు ఒకరి నుంచి ఇంకొకరికి సంక్రమించేవి కాదు, సామూహికంగా ఏకకాలంలో సంభవించేవి కాదు. కానీ యేసును చాలా మంది ఏకకాలంలో చూశామన్న అనుభవాల్ని ఇది వివరించలేదు.
* సాధారణంగా ఆశతో ఎదురుచూసే వ్యక్తులకు సంభవించే సంభావ్యత ఎక్కువ, కానీ శిష్యులు ఆయన పునరుత్థానుడు అవుతాడన్న నిరీక్షణ లేకుండా పిరికి పందల్లా పారిపోయిన వ్యక్తులు. వాళ్ళు సందేహించే అవకాశమే ఉంటుంది కానీ భ్రమపడే అవకాశాలు అత్యల్పం.
* ఒక ప్రత్యేక స్థలంలో గానీ, కాలంలో గానీ వ్యక్తులు భ్రమలకు లోనుకావచ్చుగానీ, యేసును

చూచినట్లు అనుభవాలు భిన్నమైన స్థల కాలాల్లో ఉన్నట్లు మనం గమనిస్తాం.

* సందేహించిన యాకోబు, క్రైస్తవ్యానికి శత్రువుగా బ్రతికిన సౌలు ఎందుకు భ్రమపడతారు?

### ఇ) ప్రాచీన నిగూఢ మతాలనుంచి అరువు తెచ్చుకొన్నారు

యేసు పునరుత్థానాన్ని ప్రాచీన అనాగరిక మతాలలో అప్పటికే ఉన్న నమ్మకాలనుంచి సంగ్రహించారు అనేది ఈ సిద్ధాంత ప్రతిపాదన.

* గ్రీకు పురాణగాథల్లోని ఆటిస్ (Attis) పునరుత్థానుడైనట్లు ఏ ప్రాచీన ప్రతిలోనూ ఖచ్చితంగాలేదు, అలాగే అడోనిస్ (Adonis) ను ఆరాధించడాన్ని పునరుత్థానంతో ముడిపెట్టడానికి చేసే ప్రయత్నాలు కూడా ఆధారరహితమైనవి.
* ఈజిప్ట్ పురాణాల ప్రకారం మరణానంతర జీవితాలకు దేవుడైన ఒసైరస్ (Osiris) ముక్కలైన శరీరభాగాల్ని ఏకం చేసిన తర్వాత భూగర్భ ప్రపంచానికి ప్రభువయ్యాడు. దీన్ని పునరుత్థానంతో పోల్చడం ప్రశ్నార్థకమే అంటారు ప్రసిద్ధ థియోలాజియన్ బ్రూస్ మెడ్జగర్.
* ప్లుటార్కు (Plutarch) ప్రకారం భక్తిగల విశ్వాసులు ఆసరిస్ శరీరం ఇప్పటికీ ఏ ప్రదేశంలో ఉందో అదే చోట తమ శవాలను పాతిపెట్టాలని కోరుకొంటారు. ఇది పునరుత్థానం ఖచ్చితంగా కాదు.
* అందుకే "మరణించి తిరిగి లేచిన దేవుడు తన పట్ల విశ్వాసం చూపిన వారిని నిత్యజీవానికి నడిపించే ఆలోచనే ప్రాచీన గ్రీకు పౌరాణిక మతాలలో ఎక్కడాలేదు" అని అంటారు ఫ్రెంచ్ దేశానికి చెందిన పండితుడు ఆంద్రీ బౌలాంగర్.

### మన స్పందన


"క్రీస్తు మనలను మన అహాల విషయంలోనూ, స్వంత విలువల విషయంలోనూ చనిపోవడానికి పిలిచారు, అయితే శిష్యులుగా పిలుచుకోవడం అంటే క్రొత్త జీవితాలను జీవించడానికి కూడా" అని అంటారు డైట్రిచ్ బాన్‌హాఫర్. యేసుక్రీస్తు శిష్యులుగా నూతన జీవితాల్ని జీవించడం ఆయన పునరుత్థాన సత్యం వెలుగులో బతకడమే. ఆయన పునరుత్థానం మన జీవితాల్లోని అనేక రంగాల్ని ప్రభావితం చేస్తుంది.

1. దేవుడు క్రీస్తులో మన పాపాల్ని క్షమించారు అని పునరుత్థానం ద్వారా ఋజువైనప్పుడు, అదే క్రీస్తు క్షమాగుణాన్ని అనుసరించాలి.
2. దేవుడు క్రీస్తును ప్రథమ ఫలంగా మృతులలో నుండి లేపారు (1 కొరింథీ 15:20), గనుక మన పునరుత్థానంలో మన శరీరాలను కూడా విమోచిస్తారన్న నిరీక్షణ ఉంది. దేవుడు కేవలం ఆత్మల పట్ల మాత్రమే శ్రద్ధ కలిగిలేడని, మనిషిని ఆయన సంపూర్ణంగా చూస్తున్నారని అర్థమవుతుంది. మనుష్యుల్ని ఆత్మలుగా కాకుండా సంపూర్ణులుగా చూడడం, వ్యవహరించడం అల వర్చుకోవాలి.
3. మనల్ని బలపరచమని, ఆదరించమని చేసే ప్రార్థనలు మరణం గెలిచి పునరుత్థానుడైన క్రీస్తుకు చేస్తున్నామన్న స్పృహ మనదైనందిన జీవితాలను ప్రభావితం చేస్తుంది.
4. క్రీస్తు పునరుత్థానం ఆయన తన గూర్చి చేసిన అసాధారణ సవాళ్ళు సత్యమని అంగీకరించడానికి స్థిరమైన పునాది. కాబట్టి మన విశ్వాసం హేతుబద్ధమైనదే గానీ మూఢ విశ్వాసం మాత్రం కాదు.
5. మృత్యువుని జయించిన యేసు పునరుత్థానం కేవలం రాబోయే రాజ్యాన్ని మాత్రమే కాదు, మన ప్రపంచంలోనికి జీవితాలలోనికి యేసు ద్వారా ప్రవేశిస్తున్న దేవుని రాజ్యాన్ని కూడా సూచిస్తుంది. కాబట్టి మన వైఖరిని, జీవితాన్ని, ప్రవర్తనను ఆయన అధికారం క్రిందకు తెచ్చి ఆయన విలువలకు తగినట్లు జీవించాలి.
6. క్రీస్తు పునరుత్థానుడైనందున "సర్వసృష్టికి సువార్త ప్రకటించమని" ఇచ్చిన పరిచర్యలో మన పని ఎన్నటికీ వృథాకాదు, సదాకాలం మీతో ఉంటానన్న ఆయన వాగ్దానం గొప్ప భరోసాను ఇస్తుంది.

– **డి. అనిల్ కుమార్,** వైజాగ్

**Reference:**


1. Beyond Death: Exploring the Evidence for Immortality: Gary R. Habermas
2. The Cross Is Not Enough: Living as Witnesses to the Resurrection: Ross Clifford, Philip Johnson
3. The Gospel and the Greeks: Did the New Testament Borrow from Pagan Thought? Ronald H. Nash
4. "On the Physical Death of Jesus Christ" Journal of the american medical association, Vol-255,No.11(21 March 1986) William D Edwards




# సమాధికి అవతల ఉన్న నిరీక్షణ


తాను ఎవర్ని అని యేసుక్రీస్తు ప్రభువు చెప్పుకొన్నారో దానికి చిహ్నమే, శిఖరాగ్ర నిదర్శనమే ఆయన పునరుత్థానం. "పునరుత్థానమును, జీవమును నేనే" (యోహాను 11:25).

మన నూతన జీవితం, సమృద్ధియైన జీవితం, నిత్యజీవం అనేవి మరణాన్ని జయించి తిరిగిలేచిన ప్రభువుతో, ఆయనతో మనకు కలిగిన ఐక్యతతో ముడిపడి ఉన్నాయి. ఆయన అసాధారణ జన్మ, పవిత్రమైన జీవితం, పాపుల ప్రతినిధిగా ఆయన పొందిన మరణం, జయప్రదమైన ఆయన పునరుత్థానం, తీర్పు తీర్చడానికి రాబోతున్న ఆయన రెండవ రాకడ ఆయన ఎవరో అనే విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. అయితే, ఆయన పునరుత్థానం ఆయన మొదటి రాకడలోని విషయాలన్నిటినీ ధృవీకరిస్తుంది. "మరియు క్రీస్తు లేపబడియుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే, మీ విశ్వాసమును వ్యర్థమే" (1 కొరింథీ 15:14).

యేసుక్రీస్తు పునరుత్థానం గూర్చి పాతనిబంధనలో ప్రవచించబడింది (లేఖనముల ప్రకారం మూడవ దినమున లేపబడెను 1 కొరింథీ 15:4), సువార్తలలో నిరూపించబడింది, పత్రికలలో వర్ణించబడింది, అపొస్తలుల కార్యముల గ్రంథంలోని అపొస్తలుల బోధలలో అది ప్రధానాంశం అయ్యింది (అపొ.కా. 2:31; 4:2, 33; 17:32). ప్రకటన గ్రంథంలో తెలియజేయబడిన విధంగా త్వరలో సంభవించే సార్వభౌముడైన ప్రభువు రెండవ రాకడతో ఇది ముగుస్తుంది.

యేసుక్రీస్తు పునరుత్థానం లాజరు మరియు మొదలగువారు పొందిన పునరుజ్జీవం, అంటే ప్రాణం తిరిగి రావడం లాంటిది కాదు. బలహీనత, ముసలితనం, మరణానికి గురవ్వని, నిత్యత్వానికి చేరడానికి అనువుగా ఉండే ఒక నూతనమైన జీవితం కలిగిన శరీరం అది. ఈ లోకసంబంధమైన, బలహీనత, అగౌరవం, మరణం కలిగిన శరీరం–శక్తితో, గౌరవం కలిగిన, ఆత్మీయ శరీరంగా మార్చబడింది. "శరీరము క్షయమైనదిగా విత్తబడి అక్షయమైనదిగా లేపబడును" (1 కొరింథీ 15:42–44).

యేసుక్రీస్తు పునరుత్థాన శరీరం తాకడానికి అనువుగా ఉన్న శరీరం. ఆయన ఆత్మ స్వరూపంలో పునరుత్థానం చెందలేదు. "వారు ఆయన యొద్దకు వచ్చి, ఆయన పాదములు పట్టుకొని ఆయనకు మ్రొక్కిరి" (మత్తయి 28:9). కాల్చబడిన ఒక చేపను ఆయన తిన్నారు (లూకా 24:43). తోమాకు తన చేతి గాయాలను, ప్రక్కలోని గాయాన్ని చూపించారు (యోహాను 20:27). విశ్వాసంలో వెనుకకు జారిపోయిన తన శిష్యులకోసం ఆహారాన్ని సిద్ధపరచారు



(యోహాను 21:12-13). అయినప్పటికీ, భౌతిక ఉనికికి సంబంధించిన సాధారణ నియమాలకు అతీతంగా పునరుత్థానుడైన యేసు యొక్క శరీరం ఉన్నది. భౌతిక, ప్రాదేశిక పరిమితులకు ఆయన అతీతునిగా ఉన్నాడు. యేసుక్రీస్తు భౌతిక పునరుత్థానం, నిత్యత్వ సంబంధమైన ఆయన పునరుత్థాన శరీరం అనేవి దేవుడు మొదట సృజించిన భౌతిక సృష్టి యొక్క గొప్పతనానికి స్పష్టమైన రుజువుగా ఉన్నది. "దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాలా మంచిదిగానుండెను" (ఆది 1:31). నీతి నివసించే నూతన భూమ్యాకాశములలో పునరుత్థానం చెందిన ప్రజలంగా మనం నిత్యమూ జీవిస్తాము.

## పునరుత్థానం - వేదాంత, అభ్యసనాత్మక అర్థాలు

### 1. పునరుత్థానుడైన క్రీస్తు క్రైస్తవ జీవితం కోసం, పరిచర్య కోసం మనల్ని శక్తితో నింపుతాడు

క్రీస్తును మృతులలో నుంచి లేపడానికి దేవుడు వినియోగించిన బలాతిశయమును మనం తెలుసుకోవాలని అపొస్తలుడైన పౌలు ప్రార్థించాడు (ఎఫెసీ 1:19). దేవుడు మనలను క్రీస్తుతో కూడా బతికించి, ఆయనతో కూడా లేపి పరలోకమందు ఆయనతో కూడా కూర్చుండబెట్టాడు. శిష్యులు పరిచర్యను ప్రారంభించబోతున్న సమయంలో పునరుత్థానుడైన క్రీస్తు తన శక్తి, సన్నిధి వారికి తోడుగా ఉంటుందని వాగ్దానం చేశాడు. తనకొరకు సాక్షులుగా ఉండడానికి అవసరమైన శక్తిని ఇస్తానని తన పునరుత్థానం తర్వాతనే ప్రభువు వారికి వాగ్దానం చేశాడు (అపొ. కా. 1:8).

### 2. క్రైస్తవ విశ్వాసం సత్యమైనదే అని క్రీస్తు పునరుత్థానం రూఢీపరుస్తుంది

"క్రీస్తు లేపబడని యెడల మీ విశ్వాసము వ్యర్థమే" (1 కొరింథీ 15:17). "ఈ జీవిత కాలము మట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించువారమైన యెడల మనుష్యులందరి కంటే దౌర్భాగ్యులమై యుందుము" (1 కొరింథీ 15:19). అనేకమంది అనేక విషయాలపట్ల విశ్వాసాన్ని కనపరుస్తారు. అయితే అవి అస్థిరమైనవి, అశాశ్వతమైనవి, కొద్దికాలం మాత్రమే ఉండేవి. అయితే, క్రైస్తవుల మైన మనం నిత్యమైన విషయాలను బట్టి క్రీస్తునందు విశ్వాసముంచుతున్నాము (కొలస్సీ 3:1,2)

### 3. క్రీస్తు పునరుత్థానం మన నీతికి ఆధారమై ఉన్నది

"మనము నీతిమంతులముగా తీర్చబడుటకై లేపబడెను" (రోమా 4:25). క్రీస్తు మనకోసం సిలువలో చెల్లించినదానిని, ఆయనను మరణం నుండి లేపుట ద్వారా దేవుడు అంగీకరించిన యెడల మనకు ఎలాంటి శిక్ష లేదు. మన శిక్ష అంతటినీ క్రీస్తు సిలువలో భరించాడు. దేవుడు క్రీస్తును నీతిమంతుడని ప్రకటించి, ఆమోదిస్తే మనం క్రీస్తుతో ఐక్యమయ్యాం కాబట్టి, మనల్ని కూడా నీతిమంతులని ప్రకటించి ఆమోదించినట్లే.

### 4. దు:ఖంలో సంతోషం

"చెప్పనశక్యమును మహిమాయుక్తమునైన సంతోషము గలవారై ఆనందించుచున్నారు" (1పేతురు 1:9). శ్రమలగుండా వెళ్తూ దు:ఖాన్ని, బాధను అనుభవిస్తున్న క్రైస్తవులను ఉద్దేశిస్తూ, క్రైస్తవులమైన మనం ఆనందంతో నింపబడి ఉన్నామని, పరిస్థితుల పై ఆధారపడే సంతోషంతో మనం నింపబడలేదని తెలియజేశాడు. పునరుత్థానుడైన ప్రభువు ఇచ్చే ఆనందమే మన బలం. పునరుత్థానుడైన క్రీస్తును చూసి శిష్యులు మహా ఆనందాన్ని పొందారు (మత్తయి 28:8).

### 5. క్రీస్తు పునరుత్థానం మన నిరీక్షణను పెంపొందిస్తుంది

బ్యాంక్ బ్యాలెన్స్, పదోన్నతి ...మొదలగు వాటికోసం మాత్రమే నిరీక్షణ ఉంచక, మరణం ఓడించబడిందని, మృతులలో నుండి వచ్చిన మొదటి ఫలం క్రీస్తు అని క్రైస్తవ విశ్వాసం నిరీక్షిస్తుంది. "దేవుడు ప్రభువును లేపెను, మనలను కూడా తన శక్తితో లేపుతాడు" (1 కొరింథీ 6:14).

పునరుత్థానుడైన, పరలోకానికి వెళ్ళిన యేసుక్రీస్తు మనకోసం ఒక స్థలాన్ని సిద్ధపరుస్తున్నాడు. ఆయన మరలా వచ్చి తనతో ఉండుటకు మనల్ని తీసుకొనివెళ్తాడు. క్రీస్తు ప్రభువు పునరుత్థానం ద్వారా దేవుడు మనకు "జీవము గల నిరీక్షణను" అనుగ్రహించాడు (1పేతురు 1:3).

### 6. శ్రమల్లో ఆదరణ

"ఆకాశమండలము గుండా వెళ్ళిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు..గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయం కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:14-16). ఆయన సమస్తమైన ఆదరణను అనుగ్రహించే దేవుడు, కాబట్టి ఆయన సహాయం కోసం ఆయన సన్నిధిని వెదుకుదాం. క్రీస్తు ప్రభువు తన మానవత్వాన్ని తన దైవత్వంలోకి తీసుకెళ్ళినందున, ప్రార్థన ద్వారా ధైర్యంతో ఆయనను మనం సమీపించవచ్చు. ఆయన మన బలహీనతలను అర్థం చేసుకొని, వాటిని అధిగమించడానికి మనకు శక్తిని ఇస్తాడు.

### 7. పునరుత్థానుడైన క్రీస్తు మన ఆరాధనకు అర్హుడు

తన పునరుత్థానం ద్వారా దేవుని కుమారుడనని ఆయన నిరూపించాడు (రోమా 1:4). యేసుక్రీస్తు యొక్క నిత్యత్వాన్ని, దైవత్వాన్ని ఆయన పునరుత్థానం నిరూపించింది. కాబట్టి, ఆయన మన ఆరాధనకు యోగ్యుడు. తోమావలె మనమందరం "నా ప్రభువా, నా దేవా" (యోహాను 20:28) అని ఆరాధించాలి. "వారు ఆయనకు నమస్కారం చేసిరి" (లూకా 24:52). పునరుత్థానుడై పరలోకానికి వెళ్ళిన క్రీస్తును ఇప్పుడు పరలోకంలో దేవదూతలు పాటలతో స్తుతిస్తున్నారు. "వధింపబడిన గొఱ్ఱెపిల్ల, శక్తియు ఐశ్వర్యమును జ్ఞానమును బలమును ఘనతయు మహిమయు స్తోత్రమును పొందనర్హుడని గొప్ప స్వరముతో చెప్పుచుండిరి" (ప్రక 5:12). తమ యెదుట పరలోకానికి వెళ్తున్న పునరుత్థానుడైన క్రీస్తు ప్రభువును శిష్యులు ఆరాధించారు (లూకా 24:52).

## క్రీస్తు పునరుత్థానం -మన ప్రతిస్పందన

1. ఆయన పునరుత్థాన శక్తి ద్వారా విజయవంతమైన జీవితాన్ని జీవించడానికి మనం పిలువబడ్డాము (రోమా 6:11-32).



2. మనం ఆయనతో ఎడతెగక సహవాసం చేస్తూ, ఆయన మహిమార్థం గొప్పగా ఫలించాలి (యోహాను 15:1-15)
3. ప్రపంచంలోని వివిధ సంస్కృతులు ఉన్న ప్రజల వద్దకు వెళ్ళి వారిని శిష్యులుగా చేయాలని పునరుత్థానుడైన క్రీస్తు మనల్ని ఆజ్ఞాపించాడు (మత్తయి 28:19). అర్థవంతంగా ఆయన పరిచర్యలో పాల్గొంటూ, ఆయన పనిలో సమృద్ధిగా ఫలించడానికి మనం పిలవబడ్డాము.
4. పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నప్పటికీ ప్రభువు మీదనే మనం నిరీక్షణ ఉంచాలి.
5. మన దృష్టి, ఆప్యాయత అంతా యేసుక్రీస్తు మీదనే ఉంచాలి. సులువుగా చిక్కులు పెట్టే పాపాలలో చిక్కుకోకుండా జాగ్రత్తపడాలి (హెబ్రీ 12:1-2).
6. ఆయన న్యాయపీఠం ఎదుట నిలబడి, లెక్క అప్పగించాల్సిన సమయం కోసం, ఆయన రాకడ కోసం ఎదురు చూస్తుండాలి (2 కొరింథీ 5:10).
7. మరనాత అని మనం ప్రార్థిస్తూ, ఆయన రాకడ ద్వారా కలిగే సంపూర్ణ విమోచన కొరకు ఎదురు చూస్తూ నూతన భూమి నూతన ఆకాశంలో భూలోకంలో ఉన్న అన్ని జాతుల ప్రజలు ఆయన సింహాసనం ముందు నిలబడి ఆయనను ఆరాధించే రోజు కొరకు ఎదురుచూడాలి. పాపం పూర్తిగా తీసివేయబడుతుంది. సాతాను నిత్యనరకంలో పడదోయబడతాడు. నీతి నిరంతరమూ రాజ్యమేలుతుంది.

**- ఆరోన్ రజనీకాంత్,** హైదరాబాద్

కథానిక

# దోషుండ నేను ప్రభువా

"సిలువకు నిను నే గొట్టితిని – తులవలతో జేరితిని
కలుషంబులను మోపితిని – దోషుండ నేను ప్రభువా"

పాటతో వీధంతా మార్మోగుతోంది. ధర్మాకోలుతో చేసిన సిలువను మోస్తూ యేసువేషంతో నడుస్తున్నాడొక యువకుడు. అతని వెనకాల పైనుంచి కింది వరకూ తెల్లని కోటు ధరించిన పాస్టర్స్, వారిని వెంబడిస్తూ తెల్లటి చీరల్ని తలనిండా ముసుగులు ధరించిన సమూహం పాడుతూ వారితో కలిసి నడుస్తున్నారు. ఈతాకు మట్టలకు పూలు గుచ్చి వాటిని చేతులతో పట్టుకొని ఊపుతూ చిన్నపిల్లలంతా హడావిడిగా ముందుకు సాగుతున్నారు.

భక్తిగా వారితో కలిసి సిలువ పాట పాడుతోంది శారమ్మ. చీరకొంగు గాలికి ఎగరకుండా నడుంకు కట్టుకుంది. సిలువపై తనకోసం మరణించిన క్రీస్తును తలచుకొని గుండెలు బాదుకొంటూ ఏడుస్తోంది. శారమ్మ కంటినుంచి ధారగా నీరు కారుతోంది. మధ్య మధ్యలో చీరకొంగుతో తుడుచుకొంటూ మిగతా వారిని వెంబడిస్తోంది. సమూహం వీధి మలుపు తిరిగింది. కళ్ళు తెరిచి కొద్దిదూరంలో కనిపిస్తున్న తన ఇంటివైపు, కుళాయి దగ్గరనీళ్ళు పట్టుకొంటున్న జనాల వైపు చూసింది. ఒక్కసారిగా ఏదో గుర్తుకొచ్చింది. తలమీద కప్పిన ముసుగు తీసి జుట్టు ముడేసింది. పక్కనావిడ చెవిలో ఏదో చెప్పి కుళాయివైపు కదిలింది.

ఒకరినొకరు తోసుకొంటూ నీళ్ళు పట్టుకొంటున్న ఆడవాళ్లను పక్కకునెట్టి తన బిందె కుళాయి కింద పెట్టింది. చెమటల్లు కక్కుతూ ఆయాసపడుతూ అక్కడ నుంచున్న ఆడవాళ్లలో కోపం రగిలింది.


"ఇప్పుడొచ్చి మాకంటే ముందుగా నీళ్లెలా పట్టుకుంటావు?" అడిగింది వాళ్లలో ఒకావిడ.

"పొద్దుననగా బిందె పెట్టాను. మీ అందరికంటే నేనే ముందు పట్టుకోవాలి" అంది శారమ్మ.

"అదేమీ కుదరదు. నువ్వు లేవు కాబట్టి ఇప్పుడొచ్చి పట్టుకుంటాననంటే ఒప్పుకోం" ఒకరిద్దరు గొంతు కలిపారు.

"కుదరదు గిదరదు అన్నారంటే ఒక్కొక్కదాన్ని నరుకుతా. అడ్డుతప్పుకోండి" అంటూ వాళ్లందర్నీ తోసుకుంటూ ముందుకు కదిలింది శారమ్మ.

'సిలువకు నిను నే గొట్టితిని...' పాట వినిపించడంతో బిందె పక్కన పెట్టి అక్కడున్న ఆడవాళ్లందరి వైపు తిరిగి వేలు చూపిస్తూ "ప్రార్థన అవనీయండి..



ఒక్కొక్కదాని పని చెప్తాను. నా జోలికొస్తే ఎలా ఉంటుందో తెలిసొచ్చేలాగా చేస్తాను' అంటూ అక్కడినుంచి కదిలింది.

❋❋❋

"ఏరా అంత డల్‌గా ఉన్నావు? ఒంట్లో బాగోలేదా?" అడిగాడు నవీన్.

ఏమీ మాట్లాడలేదు జాన్. కిటికీ వైపు చూస్తూ మౌనంగా ఉండిపోయాడు.

"ఏరా ఏమీ చెప్పకుండా అలా ఉన్నావ్. నువ్వు వస్తే అందరం కలిసి సినిమాకెళ్దాం అంటున్నారు ఫ్రెండ్స్. నువ్వేమో ఇలా ఒక్కడివే నీరసంగా కనిపిస్తున్నావు. ఏంటి సంగతి?" రెట్టించి అడిగాడు నవీన్.

"ఈరోజు గుడ్‌ఫ్రైడే కదా! ఎక్కడికీ రాను" అన్నాడు జాన్.

"మరి చర్చ్‌కి వెళ్ళలేదే!" అన్నాడు నవీన్

"వెళ్లాలనిపించలేదు"

"మరెలా? వాళ్ళు టిక్కెట్స్ తీస్తారేమో! వెళ్లకపోతే వేస్ట్ అవుతాయిగా" అన్నాడు నవీన్ కంగారు పడుతూ.

"ఇవాళ కష్టంరా.. కుదిరితే రేపు చూద్దాం" అన్నాడు జాన్.

నవీన్ కళ్ళు ఆనందంతో మెరిశాయి. "అసలు రానంటావేమోనని హడలి చచ్చాను. నువ్వొస్తే రేపే వెళ్దాం" అంటూ బయటకు నడిచాడు నవీన్.

'సిలువకు నిను నే గొట్టితిని - తులువలతో జేరితిని' ఎక్కడి నుంచో లీలగా పాట వినిపించడంతో కుర్చీలో నుంచి లేచి కిటికీ వైపు నడిచాడు జాన్.

❋❋❋

''అయ్యగారు.. అయ్యగారు'' అనే పిలుపు వినిపించడంతో బయటికి వచ్చాడు కరుణాకర్.

"అయ్యగారు... ప్రాణం మీదకొచ్చింది. చేతిలో చిల్లిగవ్వలేదు. ఆసుపత్రికి తీసుకెళ్ళాలి. వడ్డీ ఎక్కువైనా పర్వాలేదు. కాస్త డబ్బులిప్పించండి" ప్రాధేయపడుతూ అడుగుతున్న విక్టర్ వైపు అసహనంగా చూస్తూ "ఎప్పుడేం అడగాలో తెలియదు. చర్చ్‌లో వాక్యం బోధించాలనే హడావిడిలో నేనుంటే డబ్బులు, డబ్బులని విసిగిస్తున్నావు. ఈరోజు గుడ్‌ఫ్రైడే.. పైగా శుక్రవారం! ఇవ్వడం అసలు కుదరదు. వెళ్ళిరా..." అంటూ లోపలికెళ్లబోయాడు కరుణాకర్.




**పాపాల్ని విడిచిపెట్టి మన ప్రవర్తననీ, జీవితాన్ని మార్చుకొన్ననాడే మనకు నిజమైన గుడ్‌ఫ్రైడే. అలాకాకపోతే మన ప్రవర్తన ద్వారా క్రీస్తును రోజూ సిలువ వేస్తూనే ఉంటాం!**

''మీరే అలాగంటే ఎలా అయ్యగారు. ప్రాణంమీదకొచ్చిందని కంగారు పడుతున్నాను తప్ప.. నాకు మాత్రం తెలియదా శుక్రవారమని! మీరే కొంచెం పెద్ద మనసు చేసుకొని ఈ గండం నుంచి గట్టెక్కించాలి" అన్నాడు వచ్చినతను.

ఆలోచనలో పడిన కరుణాకర్ కాసేపయ్యాక 'సరే సరే చూద్దాంలే.. చర్చ్ అయ్యాక కనిపించు" అన్నాడు.

''అయ్యగారు.. మీరు ఆ మాట అనొద్దు. అవతల ప్రాణం మీదకొచ్చింది'' మరింత ప్రాధేయపడ్డాడతను.

లోపలికెళ్ళి విక్టర్ అడిగిన డబ్బు తెచ్చిస్తూ "లెక్కలన్నీ తెలుసని మళ్ళీ చెప్పట్లేదు. నెల కాగానే ఠంచనుగా వడ్డీ ఇవ్వాలి. లేకపోతే నా సంగతి తెలుసుగా" అన్నాడు కరుణాకర్.

చేతిలోని డబ్బును చూస్తూ ఒక్కసారి కళ్లకద్దుకొని ఆకాశం వైపు చూస్తూ 'ప్రభువా నీకు వందనం' అన్నాడు విక్టర్.

'సిలువకు నిను నే గొట్టితిని...' సమూహం పాడుతున్న పాటను వింటూ లోపలికి నడిచాడు కరుణాకర్.

❋❋❋

మానవ జీవితమంతా చీకటికి బానిసగా మారుతోంది. పాపపు మరకలతో మలినమౌతోంది. గుడ్ ఫ్రైడే అంటే ప్రతీ సంవత్సరం ఆనవాయితీగా, ఆచారంగా చేసే పండుగలా మారిపోయింది. క్రీస్తును ప్రతీ సంవత్సరం సిలువ వేస్తూనే ఉంటాం. ఆ కాసేపు ముసుగు తొడుక్కుని గుండెలు బాదుకొంటాం, కన్నీళ్ళు కార్చేస్తాం. ఇతరుల కంటే ఎక్కువగా మన భక్తిని నలుగురిలో చాటుకోవడానికి తాపత్రయపడుతుంటాం!

ఆ రోజు దాటితే భక్తి అయిపోయింది. క్రీస్తు త్యాగాన్ని, సిలువ ధ్యానాన్ని మర్చిపోతుంటాం. లోకంలో కలిసిపోతాం, లోకులతో మమేకమవుతాం. ఇదేనా క్రీస్తు సిలువ మనకిచ్చే సందేశం? ఇదేనా క్రీస్తు సిలువ త్యాగానికి అర్థం? మనందరం ఆలోచించాలి. పాపాలు చేస్తూ ప్రతీక్షణం పడిపోవడానికి దేవుడు మనల్ని సృష్టించలేదు. గుడిలో ఉన్నప్పుడు గుంద్రంగా, బయటికెళ్తే బల్లపరుపుగా బతకడానికి క్రీస్తు మనకోసం తన ప్రాణాన్ని అర్పించలేదు. ఒక వ్రతంలాగా, ఆచారంలాగా చేయడం శుభ శుక్రవారం యొక్క ఉద్దేశం కాదు. మన హృదయంలో పాపపు ఆలోచనల కుండ బద్దలవ్వాలి. అందులోనుంచి పశ్చాత్తాపం అనే ప్రవాహం మొదలవ్వాలి. అది పరివర్తన అనే బీజం మొలకెత్తడానికి నాంది కావాలి. అంతేగానీ, గుడ్‌ఫ్రైడే రోజు గుండెలు బాదుకొని, ఈస్టర్ రోజు ఎగిరి గంతేసి ఆ తర్వాత మామూలుగా బతికేయడం క్రైస్తవులుగా మనకు అవమానం!

మనల్ని మనం సంపూర్ణంగా క్రీస్తుయేసుకు అర్పించుకోవాలి. తలమీద ముళ్లకిరీటం, ప్రక్కలో బల్లెపుపోటు, కాళ్లు, చేతుల్లో మేకులు కొట్టించుకొని వేదనకరమైన మరణాన్ని పొందిన 'సిలువ మరణపు ఉద్దేశాన్ని' మనం మర్చిపోకూడదు. పాపాల్ని విడిచిపెట్టి మన ప్రవర్తననీ, జీవితాన్ని మార్చుకొన్ననాడే మనకు నిజమైన గుడ్‌ఫ్రైడే. అలాకాకపోతే మన ప్రవర్తన ద్వారా క్రీస్తును రోజూ సిలువ వేస్తూనే ఉంటాం!

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు

# Crossword Puzzle

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | | | 3 |
| 4 | 5 | | | | ■ | |
| | ■ | ■ | | ■ | 6 | |
| 7 | | | | 8 | | |
| 9 | | | | | | |
| | ■ | ■ | | | | |
| | ■ | ■ | ■ | | | |
| ■ | 10 | | | | | |

**Horizontal**

1. The father of Elkanah, Grandfather of Samuel
5. Grandson of Caleb, Son of Hezron
7. Father of Hananiah, who withstood Jeremiah
9. A Levite of the family of Asaph
10. An ancestor of Jehu, his name signifies Jehovah Reveals

**Vertical**

2. A son of Menothai, of the tribe of Judah
3. A Jew who returned form Babylon with Zerubbabel
4. A son of Benjamin & founder of a tribal family
6. A captain of Ishbosheth's army and one of his murderers
8. A companion of Paul & native of Macedonia




*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

**Last month key:**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| R | A | M | A | B | A | I | S |
| U | ■ | A | E | M | M | A | U |
| T | ■ | R | ■ | ■ | Y | ■ | S |
| H | A | I | N | I | N | G | A |
| G | L | A | D | Y | S | ■ | N |
| ■ | M | A | R | Y | A | N | N |
| S | L | E | S | S | O | R | A |

1. *M. Ankarao, Guntur*
2. *T. Anand Babu & Koteswari, Chilakaluripet*
3. *N. Leela Kumari, Sullurupet*
4. *Mangarao Jonnakuti, Jangareddigudem*

# తగ్గాల్సిందే...

"ఆ తమ్ముడు, చాలా ఎక్కువగా మాట్లాడుతున్నాడు అన్న. నిన్నగాక మొన్న నేను అతనిని సహవాసానికి పరిచయం చేశాను. నేనెంత సీనియర్‌నో మీకు తెలుసు కదన్నా! కనీసం నా అనుభవానికి గౌరవం ఇవ్వనోడు కమిటీ మెంబర్‌గా ఎలా పని చేస్తాడన్న..." అంటూ ఫోన్‌లో చాలా గట్టిగా, కోపంగా మాట్లాడుకుంటూ కమిటీ మీటింగ్ నుండి ఇంట్లోకి వస్తున్న మనోహర్‌ని చూసి, తన భార్య 'గ్రేస్' ఒకింత ఆశ్చర్యానికి గురయ్యింది.

అభిషేక్ అన్నతో, మనోహర్ పది నిమిషాల పాటు తన బాధంతా ఫోన్‌లో చెప్పుకొన్నాడు. మనోహర్‌కి కోపం తగ్గిన తర్వాత విషయాలు తెలుసుకొందామని, గ్రేస్ అంట్లు తోముకుంటూ, తన పని తాను చేసుకొంటుంది.

ఇంతలో మరో 10 నిమిషాల తర్వాత గ్రేస్.. "భోజనం పెట్టు" అనే మాటతో భోజన ఏర్పాట్లు చేసింది. "పిల్లలు అప్పుడే పడుకున్నారేంటి?" అంటూ ప్రార్థన చేసుకోకుండానే మనోహర్ తినడం ప్రారంభించాడు. భోజనం చేసేంతవరకు గ్రేస్ కూడా మౌనంగా ఉంది. తర్వాత కుటుంబ ప్రార్థనకు చాప, పాటల పుస్తకం, బైబిల్‌ను సిద్ధం చేసింది. మనోహర్‌కి కుటుంబ ప్రార్థనకు వచ్చే మనస్సులేదని గ్రేస్‌కు అర్థమయ్యింది. అయినప్పటికీ అలా వదిలిపెట్టడం ఇష్టం లేక, వెళ్ళి భర్త ప్రక్కనే కూర్చొని నెమ్మదిగా 'ఏమైందండి' అంటూ అడిగింది.

'ఏమి లేదులే, నీకు చెప్పినా అర్థం కాదులే' అంటూ సమాధానం దాటేశాడు. కొద్దిసేపటికి మనోహరే 'అది కాదు గ్రేస్' అంటూ చెప్పడం మొదలు పెట్టాడు...

"కృపారావు తమ్ముడు ఉన్నాడు కదా. అసలు తన అనుభవం ఎంత? తన ఉద్యోగం ఏమిటి? తన చదువు ఎంత? నేనే కదా అతనిని పరిచర్యకు పరిచయం చేసింది. నేను విద్యార్థిగా ఉన్నప్పటి నుండి ఇయులో ఉన్నాను. తమ్ముడు, నిన్న గాక మొన్న ఒక సం॥ నుండి వస్తున్నాడు. కమిటీ మీటింగ్‌లో నేను చెప్పిన మాటను లెక్క చెయ్యడు, నా నిర్ణయాన్ని అసలు లెక్కలోనికి తీసుకోవడం లేదు. ఏదో అన్ని తెలిసినవాడిలా మాట్లాడుతున్నాడు. నాకు తెలియని పరిచర్యనా? నాకు తెలియని పాలసీలా?" .... అంటూ తన మనస్సులో బాధనంతా, కోపమంతా పంచుకొన్నాడు.

గ్రేస్, అంతా విన్న తర్వాత, అవునా? అంటూ, ఇంతకీ 'ఏ నిర్ణయాన్ని ఒప్పుకోలేదు?' అంటూ ఆరా తీసింది. మనోహర్ ఎవరికో ఫోన్ చెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నాడు, కానీ ఫోన్ కలవడం లేదు.



"ఈ పదవులు, పద్ధతులు, పట్టింపులు ఏవీ పరిచర్య ఫలవంతం అవ్వడానికి పనికిరావు. ఎవరికివారే గొప్పవారమనుకొంటూ పరిచర్య చేస్తే పతనమవ్వడం తప్ప ఫలితముండదు, అభివృద్ధిలోనికి రాదు.

గ్రేస్, మరలా అడగడంతో, మనోహర్ "అదే 'గుడ్‌నెస్ ఆఫ్ గుడ్‌ఫ్రైడే' ప్రోగ్రామ్‌కి నేను చెప్పిన స్పీకర్‌ని వద్దన్నాడు, నేను చెప్పిన మీటింగ్ హాల్ వద్దంటున్నాడు. అలా నేను ఏమి చెప్పినా వినే మనస్సు కనిపించడం లేదు. అసలు తమ్ముడు ఇయు బ్యాగ్రౌండ్ కాదు, ఏదో మా కాలేజ్‌లో భక్తి గల క్రైస్తవుడనే కదా మనం ఇజియఫ్‌కి పరిచయం చేసింది. ఇప్పుడేమో పెద్ద ఇజియఫ్ ప్రెసిడెంట్ హోదాలో మాట్లాడుతున్నాడు. నా బాధేంటంటే, నా అనుభవం, నా ఎక్స్‌పోజర్, నా పెద్దరికం, నా పరిచర్య ఇవన్నీ తమ్ముడికి గుర్తు రావాలి గదా?.. ఏదో ఎక్కువగా మాట్లాడుతూ, నన్ను తక్కువ చేస్తున్నాడు. ఏమనుకొంటున్నాడో అసలు... చెప్తాను. మిగిలినవాళ్ళతో మాట్లాడి విషయం తేల్చుకొంటాను" అంటూ మంచినీళ్ళకై లేచి వెళ్ళాడు.

కాసేపటికి గ్రేస్, 'సర్లేండి', ఇప్పుడు ఆ సంగతి కాస్త పక్కన పెట్టండి. కుటుంబ ప్రార్థన చేసుకొందాం రండి అంటూ మనోహర్‌కి కొంత నచ్చజెప్పి, ప్రార్థనకై కూర్చొని ఒక పాట పాడారు. ఆ రోజు బైబిల్ పాఠం యోహాను సువార్త 13వ అధ్యాయం. మనోహర్ కొంచెం ఇబ్బందిగానే కూర్చొని ఏదో ఆలోచనలో ఉన్నాడు. అయినప్పటికీ గ్రేస్ పట్టుబట్టి మనోహర్ చేత వాక్యం చదివించింది.

ఆ రోజు వాక్యం చెప్పాల్సిన వంతు గ్రేస్‌ది. మనస్సులోనే తనతో, మనోహర్‌తో దేవుడు మాట్లాడాలని ప్రార్థన చేసుకొని ప్రారంభించింది.

**1. ఆయన ఎరిగినవాడైయుండెను**


- ❋ తండ్రి, సమస్తము తన చేతికి అప్పగించునని (3వ)
- ❋ దేవుని యొద్దనుండి బయలుదేరి వచ్చానని (3వ)
- ❋ దేవుని యొద్దకు వెళ్ళవలసియున్నదని (వ. 3)
- ❋ తన గడియ వచ్చెనని పస్కాకు ముందే (వ. 1)
- ❋ తనను అప్పగించేవానిని (వ. 11)
- ❋ బోధకుడని, ప్రభువని (వ. 13).

ఇవన్నీ ముందుగానే ఎరిగి 'నేను' అంటూ దర్జాగా కూర్చోగలడు, శిష్యులతో ఏపనైనా చేయించగలడు, తన మాట నెగ్గించుకోగలడు. కానీ యేసుక్రీస్తు ప్రభువు చేసిన పని మన ఆలోచనలకు, అభిప్రాయాలకు ఆమడ దూరంలో ఉంది. ఆయన చేసిన పని 'నేను' అనేదానికి సమాధి కట్టింది.

**2. ఆయన చేసినవాడైయుండెను... (వారి పాదములను కడిగెను)**

- ❋ తన పై వస్త్రము అవతల పెట్టాడు (వ. 4)
- ❋ తానే తువాలు తీసుకొన్నాడు (వ. 4)
- ❋ తన నడుముకు తానే కట్టుకొన్నాడు (వ. 4)
- ❋ పళ్ళెములో నీళ్ళు పోసుకొన్నాడు (వ. 5)
- ❋ "పాదములు పట్టుకొన్నాడు" (వ. 5) (మురికిగా ఉన్న గోళ్ళు పెరిగి ఉన్నా.. ఎలా ఉన్నా సరే)
- ❋ "నీళ్ళతో కడిగాడు" (వ. 5)
- ❋ తువాలుతో తానే తుడిచాడు (వ. 5)

ఒక్కమాటలో చెప్పాలంటే "ఆయన అంతా ఎరిగినవాడైయుండి, శిష్యుల పాదములను కడిగి, తుడిచాడు".



తన హోదాను, ఆధిక్యతలను అవతలపెట్టి
దర్పాన్ని, దర్జాను పక్కన నెట్టి
తువాలును తన నడుమునకు కట్టి
శిష్యుల పాదాలను కడుగ మొదలుపెట్టి
నిజమైన నాయకత్వంను మనకు చూపెట్టిన
మహోన్నతుడైన దేవుడు... మహా సంఘటన....

### 3. ఆయన ప్రేమను చూపెట్టాడు

- తన వారిని ప్రేమించెను (వ. 1)
- తన వారిని సంపూర్ణంగా, అంతము వరకు ప్రేమించెను (వ. 1)
- పేతురును ప్రేమించెను

  పేతురు, "ఆయనెవరో? నాకు తెలియదని 3 సార్లు అబద్ధమాడతాడని తెలిసి (లూకా 22:54-62), అర్ధాంతరంగా ఆయనను వదలి వెళ్ళిపోతాడని తెలిసి (యోహాను 19:26), మరలా చేపలు పట్టడానికి వెనక్కి వెళ్ళిపోతాడని తెలిసి (యోహాను 21:3)... ఆయన పేతురును ప్రేమించాడు.

- తనను అప్పగింపబోయే ఇస్కరియోతు యూదాను ప్రేమించాడు.

  ఆయనను అప్పగిస్తాడని తెలిసి (వ. 11), ముద్దు పెట్టి, శుభమని చెప్పి మరీ అప్పగిస్తాడని తెలిసి (మత్తయి 26:49), 30 వెండి నాణెములకు అమ్మివేస్తాడని తెలిసి (మత్తయి 26:15)

  ఇస్కరియోతు యూదా గురించి ఆలోచిస్తే ఆయనతో పాటు తిరిగి, తిని, పండుకొని, ఆయనతో పాటు గౌరవింపబడి, ఆయన దగ్గర శిష్యుడైయుండి, డబ్బు సంచి దగ్గరుంచుకొని, అందులో దొంగిలించాడు (యోహాను 12:6)

అయినప్పటికీ ఆయన యూదాను సంపూర్ణముగా అంతమువరకు ప్రేమించాడు. పాదములు పట్టుకొనే ప్రేమించాడు. ఎంత గొప్ప దేవుడు. ఎంతో గొప్ప మాదిరి కదండీ... అంటుండగానే కరెంట్ పోయింది. అప్పటికే దేవుని వాక్యం మనోహర్‌లో పనిచేయడం ప్రారంభమైంది.

నిజమే... 'గ్రేస్' ఎంత గొప్ప దేవుడు, ఎంత గొప్ప మాదిరి చూపించాడు.. అంటుండగానే.

గ్రేస్ వెళ్ళి క్రొవ్వొత్తి వెలిగించుకొని వచ్చింది. నిద్రపోతున్న పిల్లలకు దోమలు కుట్టకుండా ఛార్జింగ్ ఫ్యాన్ పెట్టడం కోసం మనోహర్ వెళ్ళాడు. తర్వాత క్రొవ్వొత్తి వెలుతురులోనే, మిగతా వచనాలు ధ్యానించారు.

అంతలో మనోహర్, గ్రేస్ "ఇక్కడ ప్రేమించెను అని మాటలలో చెప్పడం మాత్రమే కాదు గానీ ప్రేమను క్రియలలో చూపించి పాదాలు పట్టుకొని కడిగేంతగా ప్రేమించాడు", పైపెచ్చు,"అబద్ధమాడతాడని తెలిసినా పేతురును ప్రేమించాడు, అప్పగిస్తాడని తెలిసినా యూదాను ప్రేమించాడు, అనుమానిస్తాడని తెలిసినా తోమాను కూడా ప్రేమించాడు" కదా అంటూ పశ్చాత్తాపంతో చెప్పాడు... తర్వాత 12-17 వచనాలను కూడా ధ్యానించారు.

### మన సహవాసాల్లో...

- గ్రాడ్యుయేట్‌ని అని, సీనియర్ గ్రాడ్యుయేట్‌ని అని తెలిసి
- ప్రభుత్వ ఉద్యోగిని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అని తెలిసి
- విద్యార్థి నుండి ఇయు సహవాసంలో ఎదిగి నవాడినని తెలిసి
- చాలా ఎక్కువ పరిచర్య చేసినవాడినని తెలిసి
- మంచి స్పీకర్‌ని, యాక్టివ్ గ్రాడ్యుయేట్‌ని అని తెలిసి
- వాక్యం బాగా తెలిసినవాడిని, చెప్పగల్గినవాడిని అని తెలిసి
- కమిటీమెంబర్‌ని, కౌన్సిలర్‌ని, సెక్రటరీని, కోఆర్డినేటర్‌ని అని తెలిసి

మనం ఇలాంటి పనిచెయ్యగలమా? ఇంత తగ్గగలమా? ఇలా చెప్పుకొంటూ పోతే... అంతా తెలిసినవారం అనుకుంటున్న మనం ఇంకా ఏమి సాధించాలని? పరిచర్యలో పెత్తనం చెయ్యాలి, మాట నెగ్గించుకోవాలి, పట్టింపులకు పోవాలి అని అనుకోవడం ఎంతవరకు సబబు?

మన సహవాసంలో మీరు అభ్యంతరంగా మారకూడదు. ఏమండీ! ఒక మాట చెప్తాను. "మన సహవాసాలలో క్రీస్తులాంటి మాదిరి కన్పించాలి. దానికి మీరే మొదటి వ్యక్తి కావాలి". ఇది నా ప్రార్థన అంటూ గ్రేస్ కన్నీటితో తన మాటలు ముగించింది.

**సహవాసములో**

**ఒకరినొకరు గౌరవించుకోవడం,**
**ఒకరినొకరు ప్రేమించుకోవడం,**
**ఒకరినొకరు సరిజేసుకోవడం,**
**ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం,**
**ఒకరినొకరు హెచ్చరించుకోవడం,**
**ఒకరినొకరు భరించుకోవడం,**
**ఒకరినొకరు ఆదరించుకోవడం,**
**ఒకరినొకరు అంగీకరించుకోవడం...**
**"ఒకరి పాదములు ఒకరు కడిగేంతగా"**
**తగ్గించుకోవడం చాలా అవసరం...**



"ఒకరి పాదములు ఒకరు కడుగవలసినదే" అంటూ కన్నీరు తుడుచుకొంది. అటువంటి మాదిరికి మనం నాంది కావాలి అంటూ లేచి ఏడుస్తున్న పాపను ఎత్తుకొని వచ్చి కూర్చొంది.

చివరికి మనోహర్ ప్రార్థనతో కుటుంబ ప్రార్థనను చాలా తృప్తిగా ముగించుకొన్నారు.

చివరి ప్రార్థనలో, మనోహర్ "తన తప్పును ఒప్పుకొంటూ, వాక్యపు వెలుగులో తనను తాను సరిచేసుకొని దేవునితో సమాధానపడటంతో" గ్రేస్ ఆనందానికి అవధులు లేవు. ఆ రాత్రి చాలా సంతోషంగా దేవుని కృతజ్ఞతలు చెప్పి నిద్రపోయారు.

రోజూ త్వరగా లేచే మనోహర్ ఆ మరుసటిరోజు ఉదయాన్నే నిద్ర లేవలేదు. గ్రేస్ ఉదయాన్నే లేచి, తన క్వయిట్ టైంని ముగించుకోని వంట మొదలు పెట్టింది.

ఇంతలో ఫోన్ మ్రోగింది

ఇంత ప్రొద్దునే ఎవరబ్బా! అంటూ ఫోన్ చూడగానే కృపారావు తమ్ముడు...

గ్రేస్‌కి, మనోహర్‌కి కృపారావు మొదటి నుండి తెలుసు. వీరి ద్వారానే ఇయు పరిచర్యకు కృపారావు పరిచయమయ్యాడు. వీళ్ళ ఇంటికి చాలాసార్లు వచ్చాడు. వీళ్ళతో చక్కటి పరిచయమే ఉంది. మనోహర్ పనిచేసే కాలేజ్‌లో పని చేశాడు.

'గుడ్ మార్నింగ్ తమ్ముడు', బాగున్నావా అని గ్రేస్ అడిగింది. "బాగున్నాను, అక్కా! మీరు ఎలా ఉన్నారు, పిల్లలు ఎలా ఉన్నారు" అని కృపారావు అడిగాడు. బాగున్నాము, తమ్ముడు! అంటూ కొన్ని విషయాలు మాట్లాడి పెట్టేసింది.

రెండు నెలల తర్వాత జరిగిన కమిటీ మీటింగ్‌లో కృపారావు, మనోహర్ ఇద్దరూ ఉన్నారు. మీటింగ్ సజావుగా సాగిపోతుంది. కృపారావుకు ఒకింత ఆశ్చర్యం కలిగించింది. ఏంటీ మనోహర్ అన్నలో ఇంత మార్పు. కృపారావు మాట్లాడుతుంటే ఇది మంచి నిర్ణయం అని ప్రోత్సహిస్తునాడు. ఏవైనా భిన్నాభి ప్రాయాలు వస్తే తమ్ముడు రెండు నిమిషాలు ప్రార్థన చేసి నిర్ణయం తీసుకొందాం అంటున్నాడు. ఈ మార్పును గమనించిన కృపారావులో కూడా మార్పు రాసాగింది. తనకు కూడా నేను ప్రెసిడెంట్‌ను అనే గర్వం ఎక్కడో కొంత ఉండేది. ఇప్పుడు అదిపోయి పెద్దల పట్ల గౌరవం, తగ్గించకోవడం అంటే ఏంటో, పరిచర్య విధానం ఏంటో అర్థమైంది.

"ఈ పదవులు, పద్ధతులు, పట్టింపులు ఏవీ పరిచర్య ఫలవంతం అవ్వడానికి పనికిరావు. ఎవరికివారే గొప్పవారమనుకుంటూ పరిచర్య చేస్తే పతనమవ్వడం తప్ప ఫలితముండదు, అభివృద్ధిలోనికి రాదు. అయినా, పని దేవునిది, పెత్తనం దేవునిది, ఫలితం దేవునిది. కేవలం మనం ఆయన చేతిలో "పాత్రలము" మాత్రమే. ఎవరిమైనా ఆయన చేతి పనిలో వాడబడాల్సిందే. ఆయన వాడుకోకపోతే పదవి ఏదైనా ఫలితం ఉండదు..

సహవాసములో ఒకరినొకరు గౌరవించుకోవడం, ఒకరినొకరు ప్రేమించుకోవడం, ఒకరినొకరు సరిచేసుకోవడం, ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం, ఒకరినొకరు హెచ్చరించుకోవడం, ఒకరినొకరు భరించుకోవడం, ఒకరిని ఒకరు ఆదరించుకోవడం, ఒకరినొకరు అంగీకరించుకోవడం... "ఒకరి పాదములు ఒకరు కడిగేంతగా" తగ్గించుకోవడం చాలా అవసరం...

**– యం. గాలెయ్య,** భీమవరం

# భూలోకాన్ని తలక్రిందులు చేసేవారు

ఇప్పుడు వాళ్ళు 'భూలోకాన్ని తలక్రిందులు చేసేవాళ్ళు'[1]. యేసుతో తిరిగినంతకాలం ఆయన చెబుతున్న విషయాలు పెద్దగా బుర్రకెక్కినట్లు కనబడలేదు. గాయాలలో వేలుపెట్టి చూస్తేనే గానీ ఆయన మరణాన్ని జయించాడన్న సంగతి వాళ్ళకి నమ్మబుద్ధి కాలేదు. గురువులా దయ్యాలను వెళ్ళగొట్టబోయి వల్లకాక వెనుదిరిగిన శిష్యులు వాళ్ళు. అలాంటి వ్యక్తులు ఇప్పుడు లోకాన్ని తలక్రిందులు చేస్తున్నారు. క్రీస్తు పునరుత్థానాన్ని అంతులేని ఆత్మస్థైర్యంతో వాళ్ళు ప్రకటిస్తుంటే అధికారులు, ప్రధానులు ముక్కున వేలేసుకొంటున్నారు. వేలకు వేల మంది యేసే ప్రభువని విశ్వసిస్తున్నారు.


అనూహ్యమైన ఈ మార్పు ఎలా సాధ్యమయ్యింది? ఇంత గొప్ప శక్తి, ధైర్యం వారిలోకి ఎలా వచ్చి చేరాయి? కారణాలు మనం ఊహించలేనంత కష్టమైనవికాదు. అపొస్తలుల కార్యాల గ్రంథంలోని ప్రారంభ అధ్యాయాల ను పరిశీలిస్తే ఇట్టే అర్థమైపోతాయి.

### 1. వాళ్ళు ఆత్మశక్తిని పొందారు

పరిశుద్ధాత్మ మీ మీదకి వచ్చేంతవరకు యెరుషలేములోనే వేచి ఉండమని యేసు చెప్పిన సూచనను వాళ్ళు శిరసావహించారు. పెంతెకొస్తు రోజున అగ్నినాల్కల రూపంలో దిగివచ్చిన ఆత్మ అభిషేకాన్ని అనుభవించారు. ఇక ఆ రోజు నుంచి ఆత్మ స్వాధీనంలోనే ప్రతి అడుగూ వేశారు. పరిశుద్ధాత్మ మీ మీదకి వచ్చినప్పుడు మీరు శక్తి పొందుతారు అని యేసు చెప్పిన మాట అక్షరాలా నెరవేరింది[2]. అదే శక్తి వారి మాటల్లోనూ చేతల్లోనూ దర్శనమిచ్చింది. ఓటమి కెరటాలను అధిగమించి వాళ్ళు గెలుపు తీరాల ను చేరుకొన్నారు. ఒకప్పుడు వెక్కిరించిన దయ్యాలు ఇప్పుడు గడగడ వణకడం ప్రారంభించాయి. వాళ్ళ నీడ పడితే చాలు రోగాలు నయమవుతున్నాయి[3]. ఒకప్పుడు లోకం వాళ్ళని తలక్రిందులు చేసింది, ఇప్పుడు వాళ్ళు లోకాన్ని తలక్రిందులు చేస్తున్నారు. సందేహంలేదు, అది పరిశుద్ధాత్మ దేవుని శక్తే.

### 2. వాళ్ళు ప్రార్థనతో కదిలారు

ప్రార్థన వాళ్ళ చేతిలో ఆయుధం. ఆటంకాల న్నిటినీ దాంతోనే ఛేదించుకుంటూ ముందుకు వెళ్ళారు. వాళ్ళ ప్రార్థనతో భూమి కంపించడమే కాదు యెరుషలేములో ప్రకంపనలు మొదల య్యాయి. పళ్ళు బయట పెట్టి లోకం వాళ్ళని భయపెట్టినప్పుడు ప్రార్థనాగదిలోనే వాళ్ళు ధైర్యాన్ని పోగుచేసుకున్నారు[4]. వాళ్ళు ప్రారంభించిన విమోచనోద్యమానికి ప్రార్థనే ఇంధనం అయ్యింది. ప్రార్థనే వాళ్ళ హృదయ స్పందనలకు ప్రాణవాయువు



అయ్యింది. మతసాంప్రదాయ పునాదుల్ని ప్రార్థనతో పెకళించారు. శత్రుసామ్రాజ్యాన్ని ప్రార్థనతోనే పడద్రోశారు. గెత్సెమనే తోటలో రక్తబిందువుల మధ్య తమనాయకుడు సాతానుని ఓడించిన వైనం వాళ్ళ మనస్సుల్లో నాటుకుపోయింది. ఏ యుద్ధాన్నైనా ప్రార్థనతోనే గెలవాలని వాళ్ళకి అర్థమైపోయింది. ఆశ్చర్యంలేదు, లోకం తోకముడిచింది.

### 3. వాళ్ళు సాక్షులుగా నిలిచారు

యేసు వాళ్ళను పరిశుద్ధాత్మ శక్తితో నింపింది అందుకే. మీరు సాక్షులై ఉండాలి అని వారితో చెప్పాడు. హతసాక్షులయ్యేవరకు వాళ్ళు అదేపని మీద ఉన్నారు. న్యాయస్థానంలో నిలబడి చూసింది చూసినట్లు చెప్పేవాళ్ళే సాక్షులు. ప్రజా కోర్టులో నిలబడి ఇప్పుడు వాళ్ళు చేస్తున్నది అదే. మీరు చంపి పాతిపెట్టిన క్రీస్తు తిరిగి సమాధిలోనుంచి లేవడం మేము చూశాం అంటున్నారు వాళ్ళు[5]. మరి చంపిన వాళ్ళు ఊరుకుంటారా? ఊరుకున్నా ఊరుకోకపోయినా మేము మాత్రం చూసింది చెప్పి తీరతామని పట్టుబట్టారు. దేవుని మాట వినాలా, మీ మాట వినాలా[6], అని ఎదురు ప్రశ్నించారు. అందరూ క్రీస్తు చనిపోయాడని నిర్ణయానికొచ్చేస్తుంటే వాళ్ళు చూస్తూ ఉండలేకపోయారు. ఎందుకంటే వాళ్ళు పునరుత్థానుడైన క్రీస్తును తాకారు, విన్నారు, నిదానించి చూశారు. ఇక వాళ్ళనెవరు ఆపగలరు? క్రీస్తు పునరుత్థానం వాస్తవం. అదే మానవుని సమస్యల పరిష్కారం. ఇదే లోకాన్ని కదిలించిన వాళ్ళ సందేశం.

### 4. వాళ్ళు కలిసి మెలసి ఉన్నారు

దర్శనాన్నే కాదు ఆస్తిని కూడా వాళ్ళు కలిసి పంచుకొన్నారు[7]. కష్టమొచ్చినా సుఖమొచ్చినా కలిసే అనుభవించారు. మనుషులు వేరైనా వాళ్ళ మనసు ఒకటే. శరీరాలు వేరైనా వాళ్ళ హృదయ స్పందన ఒకటే. వాళ్ళందరి గమ్యం ఒకటే, గమ్యం వైపు వారు వెళ్ళే మార్గమూ ఒకటే. వాళ్ళందరిదీ ఒకటే మాట. ఎందుకంటే సాక్ష్యం చెప్పేవాళ్ళంతా ఒకే మాట మీద నిలబడాలి. లేకుంటే సాక్ష్యం బలహీనమైపోతుంది. అందుకే ఐక్యతను చెడగొట్టే చీడపురుగుల్ని వాళ్ళు సహించలేకపోయారు. పచ్చని సహవాసాన్ని పాడుచేసే సాతాను ఏజెంట్లను వాళ్ళు నిలదీశారు. పాపం ఒప్పుకొని పశ్చాత్తాపపడని వారిని



పాతిపెట్టేశారు[8]. ఒకప్పటి అభిప్రాయబేధాలు వారిలో ఇప్పుడు లేవు. ఏ కుర్చీలో ఎవరు కూర్చోవాలి అన్న మీమాంసను వాళ్ళెప్పుడో జయించేశారు. పదవులు, హోదాలకు వాళ్ళు అతీతులు. అలాగే ఉంటారు మరి, లోకాన్ని తలక్రిందులు చేసేవారు.

### 5. వాళ్ళు కష్టాలను ఓర్చుకొన్నారు

వాళ్ళు నడిచింది పూలబాటకాదు, సిలువబాట. క్రీస్తు మోసినట్లు వాళ్ళూ తమ సిలువల్ని మోశారు. ముళ్ళూ, రాళ్ళూ, వాళ్ళ కాళ్ళకూ గుచ్చుకొన్నాయి. నన్ను ద్వేషించిన లోకం మిమ్మల్నీ ద్వేషిస్తుంది అని యేసు ముందే హెచ్చరించాడు[9]. నన్ను చంపుతున్న ఈ లోకం మిమ్ముల్ని కూడా వదిలిపెట్టదని కుండబద్దలు కొట్టాడు. అయినా వాళ్ళు సంతోషంగా ముందుకు సాగారు. ఆయనలాగే అన్నిటినీ సహించారు. రాబోయే ఆనందం కోసం అవమానాన్ని నిర్లక్ష్యపెట్టిన క్రీస్తే వారికి ఆదర్శం[10]. సిలువను సహించి దేవుని సింహాసనం మీద ఆసీనుడైన ఆయనను చేరుకోవడమే వారి లక్ష్యం. చావడానికి వాళ్ళు భయపడలేదు, ఎందుకంటే వాళ్ళు పునరుత్థానాన్ని చూశారు. వాళ్ళలో కొందరిని లోకం తలక్రిందులుగా సిలువ వేసింది. కానీ తలక్రిందులైన ఈ లోకానికి బహుశా ఆ సిలువ సరిగానే కనిపిస్తూ ఉంటుంది.

– డా. తాళ్ళూరి ప్రసాద్

1. అపొ.కా. 17:6, 2. అపొ.కా. 1:8, 3. అపొ.కా. 5:15, 4. అపొ.కా. 4:31, 5. అపొ.కా. 3:15, 6. అపొ.కా. 4:19, 7. అపొ.కా. 4:32, 8. అపొ.కా. 5:10, 9. యోహాను 15:18, 10. హెబ్రీ 12:2

His voice leads us not into timid discipleship but into bold witness.

- Charles Stanley

# సంపూర్ణ సమర్పణ

క్రీస్తునందు అతి ప్రియమైన యుఇయఫ్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామంలో శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

"మరియు నా దేవుని మందిరము మీద నాకు కలిగియున్న మక్కువచేత నేను ఆ ప్రతిష్ఠితమైన మందిరము నిమిత్తము సంపాదించిన వస్తువులు గాక, నా స్వంతమైన బంగారమును వెండిని నా దేవుని మందిరము నిమిత్తము నేనిచ్చెదను" - 1 దిన 29:3

దావీదుకు దేవునిపై, దేవుని మందిరముపై కలిగియున్న మక్కువ చేత మందిరము నిమిత్తము సంపాదించిన వస్తువులు కాక విలువైన వాటిని ఇవ్వడానికి తీర్మానము చేసుకొని సమర్పించాడు. దావీదు యొక్క జీవితం విలువలు కలిగి జీవించమని మనలను పురికొల్పుతుంది. దావీదు సమర్పణ అతనితో కూడా ఉన్న అధికారులను స్పందింప చేయగల్గింది. దేవుని పట్ల నెహెమ్యా పట్టుదల, పేద విధవరాలు సమర్పణ, ఆది సంఘంలో విశ్వాసుల సమర్పణ, పౌలు మాదిరి, యుఇయఫ్ఐ పితరుల త్యాగపూరిత జీవితాలు, అన్నిటికంటే ముఖ్యంగా మన ప్రభువైన యేసుక్రీస్తు సంఘం కోసం తన్నుతాను అప్పగించుకొనిన విధం. ఇవన్నీ మనకెంతో మాదిరి, పురికొల్పు. యోహాను 2:17 ప్రకారం "ఆయన శిష్యులు - నీ యింటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించునని రాయబడియున్నట్టు జ్ఞాపకం చేసుకొనిరి".

విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్స్‌గా, ఆయన పరిచారకులుగా మనలను మనము ఒకరినొకరు పురికొల్పుకొంటూ సమర్పించుకుందాం. అనేకులకు మాదిరిగా, ఆశీర్వాదంగా జీవించేటట్లు, ప్రభువు సహాయం చేయును గాక!

*గమనిక: ఏసియం-2021 నిర్ణయం ప్రకారం ఇయు, ఇజియఫ్‌లలో ధనం మిగిలుంటే దానిలో అవసరాల నిమిత్తం 20% ఉంచుకొని మిగిలినది నంబూర్ ఆఫీస్‌కు పంపగలరు.*

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయఫ్ఐ-ఏపి ఏసియం-2021 తర్వాత పెరిగిన 18% బడ్జెట్‌కు అనుగుణంగా 42 ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపిస్తున్నాయి. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మిగిలిన ఇజియఫ్‌లు కూడా ప్రార్థించి సహకరించవలసిందిగా కోరుచున్నాము.
2. యుఇయఫ్ఐ నేషనల్‌కు ప్రతి నెల ఆఫీసునుంచి పంపే కాంట్రిబ్యూషన్స్ 75,000/- నుంచి 80,000/- రూ. పెంచడానికి స్టేట్ యాన్యువల్ కౌన్సిల్‌లో నిర్ణయించారు. పెరిగిన 5,000/- కొరకు
3. స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
4. యాన్యువల్ ఇంక్రిమెంట్, నూతన కో-ఆర్డినేటర్స్ నియామకాల వలన అవసరమైన అదనపు ధనం 60 వేల కోసం
5. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
**యస్. ఆర్. డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,10,000/- (18% Hike W.R.T present income)**

## FEBRUARY 2022

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 472.00 | Field Staff Salaries | 4,51,416.00 |
| General Fund | 8,85,902.00 | Field Staff HRA, CA, MA & TA | 1,84,740.00 |
| Staff Support | 23,500.00 | Office Staff Salaries | 1,70,746.00 |
| Rajasthan | 10,000.00 | UESI | 80,000.00 |
| SWF | 35,200.00 | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000 |
| | | Office Expenditure | 20,103.00 |
| | | Closing Balance | 69.00 |
| **Total** | **9,55,074.00** | | **9,55,074.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-03-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# సిలువ-సవాలు

ఈ క్లిష్ట సమయంలో నేను నీకో సవాలు విసురుతున్నా
రక్షకుని శక్తితో సిలువ ధ్వజాన్ని భుజాన వేసుకోమని
దేవుని కోసం మానవుని కోసం ఏదో కొంత చేయమని
రక్షకుని నిత్య ప్రణాళికలో నువ్వు కూడా భాగం కమ్మని.

ఈ అంత్య దినాలలో నేను నీకో సవాలు విసురుతున్నా
ఈ లోకంలో క్రీస్తును ప్రకటించే సవాలును స్వీకరించమని
నీ జీవితకాలం ఎంత సంక్షిప్తమైనదో నువ్వు తెలుసుకోమని
దేవుని కోసం మానవుని కోసం యోగ్యమైనది చెయ్యమని.

దేవుని కుమారుని సిలువను నువ్వు చూసినప్పుడు
హతసాక్షులు చిందించిన రక్తాన్ని నీవు చూసినప్పుడు
ఈ వాస్తవాల వెలుగులో నీ వైపు నీవు చూసుకొన్నప్పుడు
దేవుని కోసం మానవుని కోసం నీవేం చేశావో చెప్పు?

రక్షకుని హృదయాన్ని నీవు సంతోషపెడుతున్నావా?
రక్షకుని త్యాగంలో నీవు పాలు పంచుకొన్నావా?
నీ ప్రేమ నిజమైనదని క్రీస్తుకు నీవు నిరూపించగలవా?
మానవాళి రక్షణ కోసం నీవేం క్రయం చెల్లిస్తున్నావు?

యేసు కోసం ఏదైనా చేసేందుకు నడుము బిగించు!
ఆయన ముళ్ల మకుట నొసటికి స్వర్ణ కిరీటాన్ని ఇవ్వు
నీ సిలువను క్రిందికి దించకు! ముందుకు కదిలిపో!
నిద్రపోకు ఆయన ప్రణాళికను నెరవేర్చే వరకు.

– వెస్లీ డ్యూవెల్